Postail Licence No. L/KNL/3-19(D). 2016 - 2018

# ఉత్తేజిత దినపత్రిక

ఎడిటర్ : చంద్ర శేఖర్ యం

Published from Kurnool ---- Circulated by Andhrapradesh, Telangana & New Delhi

సంపుటి :03 | సంచిక : 324 | పేజీలు 8 | వెల : 5 | మంగళవారం 29 ఏప్రిల్ 2025

ఉత్తేజిత దినపత్రిక

ఎడిటర్ : చంద్ర శేఖర్ యం

అక్షరాన్నే ఆయుధంగా మలుచుకున్న పత్రిక




వార్షికోత్సవ ప్రత్యేక సంచిక

ప్రకటనదారులకు విజ్ఞప్తి...

**ప్రకటనదారులకు, పాఠకులకు మా నమస్సుమాంజలులు...**

16వ వార్షికోత్సవ సందర్భంగా ప్రకటనలు మంజూరు చేయుట గురించి పాఠకులారా !.. ఉత్తేజిత దినపత్రికను హృదయపూర్వకంగా అభిమానించినందుకు మేనేజ్‌మెంట్ మీకు అభినందనలు తెలియజేస్తుంది.

జన వాక్కులే వార్తలుగా మలుచుకొని నిజాన్ని ఇజంగా చేసుకొని నిరంతరం నూతన వరవడిలో పత్రికను మీ ముందుకు తెస్తున్నామన్నా విషయం మీకందరికీ తెలిసిందే.

పత్రిక నడవాలంటే ఆర్థిక మూలాలు ముఖ్యం. కావున మీరంతా వార్షికోత్సవ సందర్భంగా ప్రకటనలు మంజూరు చేసి పత్రికాభివృద్ధికి మీ వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా అందజేయవలసిందిగా ఆకాంక్షిస్తున్నాము ....

మీ... ఉత్తేజిత దినపత్రిక ఎడిటర్

**తారీఫ్**

| | |
|---|---|
| బ్యాక్ కవర్ పేజీ మల్టీకలర్ : 50,000/- | బ్లాక్ & వైట్ పేజీ |
| ఇన్నర్ మల్టీకలర్ పేజీ : 20,000/- | బ్యాక్ పేజీ : 20,000/- |
| ఫ్రంట్ మల్టీకలర్ పేజీ : 70,000/- | ఇన్నర్ పేజీ : 20,000/- |
| | ఫ్రంట్ పేజీ : 30,000/- |

గమనిక : సకాలంలో ప్రకటనల తాలుకా ఫోటోలు మరియు మెటీరియల్‌ను ఉత్తేజిత తెలుగు దినపత్రిక విలేకరులకు అందజేయవలసిందిగా కోరడమైనది.



" మన పిల్లలు ప్రపంచస్థాయి సేవలు అందించే స్థాయికి ఎదగాలి. వాట్సప్ సేవ ద్వారా ప్రజలకు పరిపాలన, ప్రభుత్వ సర్వీసులు దగ్గర చేశాం. వాట్సప్ ద్వారా వెయ్యి రకాల సేవలు అందిస్తున్నాం. స్వర్ణాంధ్రప్రదేశ్ 2047కి మార్గసూచి రూపొందిస్తున్నాం. ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదిగింది. త్వరలోనే అగ్రగామిగా నిలబడుతుంది. ఉగ్రదాడులు భారత్‌ను ఏమీ చేయలేవు. "

## ఐటి గురించి మాట్లాడితే
# ఆశ్చర్య పోయారు
## ఇప్పుడు క్వాంటమ్ కంప్యూటర్స్ రాబోతున్నాయి
## విల్ కాలేజీ క్యాంపస్‌లో చంద్రబాబు ప్రసంగం

అమరావతి: తాను ఐటి గురించి మాట్లాడితే అంతా ఆశ్చర్య పోయారని, ఇప్పుడు క్వాంటమ్ కంప్యూటర్స్ రాబోతున్నాయని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. హైదరాబాద్‌లో 14 నెలల్లోనే గతంలో హైటెక్ సిటీ పూర్తి చేసినట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. భవిష్యత్ అంతా ఐటీదేనని అప్పట్లో తల్లిదండ్రులకు పిలుపునిచ్చామని చెప్పారు. స్టార్టప్ కంపెనీల కోసం వి-లాంచ్ పాడ్ 2025ని చంద్రబాబు ఆవిష్కరించారు. అమరావతిలోని విట్ వర్సిటీలో అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. 'ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా భారతీయులు ఉంటారు. అందులో అగ్రస్థానంలో తెలుగువారు ఉంటారన్నారు. మే 2న ప్రధానమంత్రి మోదీ అమరావతికి వస్తున్నారు. ప్రధాని చేతుల మీదుగా అమరావతి పునఃప్రారంభం కాబోతోంది. అప్పట్లో ఐటీని ప్రమోట్ చేశా.. ఇప్పుడు క్వాంటమ్ టెక్నాలజీని ప్రమోట్ చేస్తున్నా. ఒకప్పుడు ప్రభుత్వ అటెండర్ ఉద్యోగానికి కూడా డిమాండ్ ఉండేది. ఇప్పుడు కలెక్టర్ పోస్టు కంటే ఐటీ ఉద్యోగానికే డిమాండ్ ఎక్కువగా ఉంది. విట్ అమరావతిలో 95 శాతం ప్లేస్‌మెంట్లు వస్తున్నాయి. మీరు ఉద్యగంలో సంతృప్తి చెందవద్దు.. కొత్త సంస్థలు స్థాపించండి. సిలికాన్ వ్యాలీలో కంపెనీల సీఈవోలంతా తెలుగోళ్లు, భారతీయులే. తీవ్రవాదం సమస్యలు భారత్‌ను ఏమీ చేయలేవు' అని చంద్రబాబు అన్నారు. వచ్చేనెల 2న ప్రధాని మోడీ అమరావతికి వస్తున్నారు. ప్రధాని రాక కోసం పూర్తిస్థాయి ఏర్పాట్లు చేస్తోంది ఏపీ ప్రభుత్వం .. లక్షలాదిగా రైతులు, ప్రజలు తరలి రావడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.. సెక్రటేరియట్ వెనుక స్థలంలో అతిపెద్ద సభ ఏర్పాటు చేస్తున్నారు.. ఆ ఏర్పాట్లపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు..అమరావతి పునర్నిర్మాణానికి ప్రధాని మోడీని సీఎం స్వయంగా ఆహ్వానించారు.. సభకు ప్రధాని మోడీ, మధ్యాహ్నం 3:25కి వస్తారు.. 3:32కి వేదిక మీదకు వస్తారు.

. 3:50కి 11 నిముషాల అమరావతి పనుల వీడియో ప్లే అవుతుంది.. 4:05 నుంచి 40 నిముషాలు ప్రధాని నరేంద్ర మోడీ

ప్రసంగిస్తారు.. ఆ తరువాత ప్రధాని నరేంద్ర మోడీ బయల్దేరి వెళ్తారు? అయితే? మోడీ రాక సమయంలో భారీ బందోబస్తు ఏర్పాట్లు ఉంటాయి.. అలాగే రైతులు చేరుకోవడానికి కావాల్సిన ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేయాలని సీఎం ఆదేశించారు. ఇకపై ప్రధాని మోడీ పర్యటన పూర్తయ్యే వరకు ప్రతీరోజూ సీఎం సమీక్షలు నిర్వహించనున్నారు..ఈ సందర్భంగా మహాత్మా గాంధీ బ్లాక్, వి.వి.గిరి బ్లాక్, దుర్గాబాయి దేశముఖ్ బ్లాక్ నూతన భవనాలను ఆయన ప్రారంభించారు.



# పద్మభూషణ్
## అందుకున్న బాలకృష్ణ

న్యూఢిల్లీ: ప్రముఖ సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పద్మ భూషణ్ అవార్డు అందుకున్నారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మ ఆయనకు పురస్కారం అందజేశారు. రాష్ట్రపతి భవన్‌లో పద్మ అవార్డుల వేడుక జరిగింది. గణతంత్ర దినోత్సవం వేళ కేంద్ర ప్రభుత్వం పద్మ పురస్కారాలు ప్రకటించిన సంగతి తెలిసిందే. 2025 సంవత్సరానికి గాను పద్మ పురస్కారాలను కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. సోమవారం పద్మ పురస్కారాల ప్రదానోత్సవం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో అట్టహాసంగా జరిగింది. భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్మ చేతుల మీదుగా పలు రంగాల్లో విశేష కృషిని అందించిన కళాకారులు అవార్డులను అందుకున్నారు. ఈ సందర్భంగా తెలుగు సినీ పరిశ్రమ నుండి హీరో నందమూరి బాలకృష్ణకి కేంద్రం పద్మ భూషణ్ అవార్డును అందుకున్నారు. తెలుగుదనం ఉట్టిపడేలా పంచె కట్టులో బాలకృష్ణ'పద్మ' అవార్డుల ప్రదానోత్సవానికి హాజరయ్యారు. దిల్లీలోని మాన్‌సింగ్ రోడ్డు నుంచి రాష్ట్రపతి భవన్‌కు కుటుంబంతో కలిసి ఆయన బయలుదేరిన దృశ్యాలు నెట్టింట వైరల్ అయ్యాయి. తండ్రి అడుగు జాడల్లో ప్రయాణించి నటుడిగా ప్రశంసలు దక్కించుకున్నారు బాలకృష్ణ. గతేడాది 50 ఏళ్ల సినీ ప్రయాణాన్ని పూర్తి చేసుకున్నారు. పౌరాణికం, జానపదం, సాంఘికం, సైన్స్ ఫిక్షన్, బయోపిక్.. ఇలా అన్ని జానర్లను టచ్ చేసిన ఏ-కై-క అగ్ర నటు-డిగా ఆయన తెలుగు ప్రేక్షకుల మది దోచుకున్నారు.



2వ

**తిరుపతి జిల్లాలో ఘోరరోడ్డు ప్రమాదం**




2వ

**చెత్త సేకరణకు అధిక ప్రాధాన్యం మంత్రి నారాయణ వెల్లడి**


## కాశ్మీర్‌లో కొనసాగుతున్న ఉగ్రవాదుల వేట

నలుగురు ముష్కరులు నక్కిన స్థావరాల గుర్తింపు

దొరికినట్లే దొరికి తప్పించుకుంటున్న ఉగ్రవాదులు

ఆక్రమిత కాశ్మీర్‌లో ఉగ్రస్థావరాలు లేపేస్తున్న పాక్

**పాక్ గుండెల్లో గుబులు.. ఉగ్రవాదులను తరలిస్తున్న దాయాది సైన్యం? పీవోకేలోని ఉగ్రవాద లాంచ్ ప్యాడ్‌లను పాకిస్థాన్ సైన్యం ఖాళీ చేయిస్తున్నట్లు నిఘావర్గాల సమాచారం.**



2వ

## పర్యాటకుల ప్రాణాలు
# కాపాడలేకపోయాం

కాశ్మీర్ అసెంబ్లీలో సిఎం ఒమర్ అబ్దుల్లా వ్యాఖ్యలు

మృతులకు ఘనంగా నివాళి అర్పించిన అసెంబ్లీ

పహల్గాం దాడిపై చర్చించేందుకు అక్కడి అసెంబ్లీ నేడు అత్యవసరంగా సమావేశమైంది. ఈ సందర్భంగా ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ ఇలాంటి దాడులు గతంలో చాలా చూశాం. కానీ, బైసరన్‌లో ఇంత పెద్ద స్థాయిలో దాడి చేయడం మాత్రం 21 ఏళ్లలో ఇదే తొలిసారి. మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు ఎలా క్షమాపణలు చెప్పాలో కూడా తెలియడం లేదు. రాష్ట్రానికి వచ్చిన పర్యాటకులను సురక్షితంగా తిరిగి పంపాల్సిన బాధ్యత మాదే.



2వ

## గ్రూప్-1 స్టేపై టీజీపీఎస్సీ అప్పీల్

హైదరాబాద్: గ్రూప్-1 అభ్యర్థుల నియామకంపై హైకోర్టు స్టే విధించిన నేపథ్యంలో అంశంపై టీజీపీఎస్సీ కీలక నిర్ణయం తీసుకుంది. గ్రూప్-1 పరీక్షపై టీజీపీఎస్సీ అప్పీల్ దాఖలు చేసింది. సింగిల్ బెంచ్ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులపై సవాల్ చేసింది. ఈ పిటిషన్‌పై మంగళవారం తెలంగాణ హైకోర్టులో విచారణ జరగనుంది. హైకోర్టు ఉత్తర్వులతో తెలంగాణలో గ్రూప్ 1న నియామకాలు సందిగ్ధంలో పడ్డాయి. గ్రూప్1 పరీక్షల్లో అక్రమాలు జరిగాయంటూ పలువురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. 19మంది ప్రభుత్వ ఉద్యోగులు, ఒక నిరుద్యోగ అభ్యర్థి పరీక్షల్లో అక్రమాలపై హైకోర్టును ఆశ్రయించారు. రెండు సెంటర్లలో పరీక్షలు రాసిన వారే ఎక్కువగా ఎంపిక కావడంపై 20మంది అభ్యర్థులు హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. తెలంగాణ గ్రూప్ 1 పరీక్షల్లో అక్రమాలు జరిగాయంటూ దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన హైకోర్టు అర్హత సాధించిన అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరపాలని పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ఆదేశించింది. వారికి నియామక పత్రాలను మాత్రం తుది తీర్పు తర్వాత అందించాలని ఆదేశించింది. సింగిల్ బెంచ్ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులపై టీ-జీపీఎస్సీ ఈ నిర్ణయం తీసుకుంది.

## సిఎం రేవంత్ భయానికే అసెంబ్లీకి కెసిఆర్ డుమ్మా

సంగారెడ్డి: గాంధీ కుటుంబంపై కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ వర్కింగ్ ప్రసిడెంట్ జగ్గారెడ్డి తిప్పికొట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి భయానికే కేసీఆర్ అసెంబ్లీకి పోవడం లేదని మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. కేసీఆర్‌ను కడిగేస్తాడు అని భయం పట్టుకుందన్నారు. అది తప్పించు కోవడానికి అసెంబ్లీకి పోవడం లేదన్నారు. ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్‌పై మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ అంటే నాకు గౌరవం. పరిపూర్ణత చెందిన నాయకుడి అని నేను భావిస్తా. కేసీఆర్ పదేళ్లు సీఎంగా పని చేశారు... చాలా అనుభవజ్ఞులు అని జగ్గారెడ్డి అన్నారు. కానీ..

రేవంత్, కేసీఆర్ సభలో ఎదురు పడండి తెలంగాణ శాసనసభ ఎట్లా ఉంటాదో చూద్దాని సవాల్ విసిరారు. నిన్న రజతోత్సవ సభలో కేసీఆర్ వ్యాఖ్యలపై జగ్గారెడ్డి ఫైర్ అయ్యారు. గాంధీ కుటు-ంబం కోసం నెలలు నెలలు వెయిట్ చేసింది నిజం కాదా? అని ప్రశ్నించారు. తెలంగాణ ఇచ్చే వరకు గాంధీ కుటు-ంబం హీరో అని కొనియాడారు. తెలంగాణ ఇచ్చిన తర్వాత డబ్లికేట్ గాంధీలు అయ్యారా? అని ప్రశ్నించారు. ప్రజల పట్ల కాంగ్రెస్ హీరో అని.. ప్రతిపక్షానికి విలన్ అన్నారు. బీఆర్ఎస్ ఉనికి కాపాడుకునే పనిలో సభలో జరిగిందన్నారు.. కేసీఆర్ పదేళ్లు సీఎంగా పని చేశారు... చాలా అనుభవజ్ఞులని జగ్గారెడ్డి అన్నారు. ఇప్పుడు గతాన్ని మర్చిపోయి మాట్లాడారని.. డుబ్లికెట్ గాంధీలు అనడం ఆశ్చర్యం అనిపించిందని జగ్గారెడ్డి చెప్పారు. కేసీఆర్ తెలంగాణ నినాదం నుంచి వెనక్కి తగ్గాలని అనుకున్న సమయంలో ఆయన్ని లేపింది కాంగ్రెస్ నేతలే అని సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర విభజన జరగాలి అని మా పార్టీ నేతలే వెనక నిలబడి నడిపించారన్నారు. కాంగ్రెస్ నాయకత్వం వెనకాల లేకుంటే కేసీఆర్ దీక్ష జరిగేది కాదు.. ఇది వాస్తవం విమర్శ కోసం చెప్పడం లేదు. రాహుల్ గాంధీ పై కేసీఆర్ మాట జారాడు. మీ మాట పై మీకే విలువ లేదా..? సోనియా గాంధీ లేకుంటే తెలంగాణ వచ్చేది కాదు అని చెప్పింది నువ్వే కదా..? రాహుల్ గాంధీ తెలంగాణ ఇచ్చేయండి అని చెప్పిన తర్వాతే ... ప్రక్రియ మొదలైంది. అప్పుడేమో.. రాహుల్..సోనియా గాంధీ దేవుళ్ళు అన్నావు. ఇప్పుడు కేసీఆర్ కడుపు నిండి ఉన్నది కాబట్టి దయ్యాలు అయ్యారా ఇవాళ. కేసీఆర్ అనవసరంగా మాట తూలుతున్నారు. నీ పార్టీకి నువ్వు ఎట్లా ప్రచారం చేశావో.. మా పార్టీకి రాహుల్ గాంధీ ప్రచారం చేశారు. రాహుల్ గాంధీ గురించి మాట్లాడిన మాటలకు క్షమాపణ చెప్పాలి. బేషరతుగా క్షమాపణ చెప్పాలి. కేసీఆర్ అంటే నాకు గౌరవం. పరిపూర్ణత చెందిన నాయకుడి అని నేను భావిస్తా. కానీ ఈ వయసులో ఇంత దిగజారి మాట్లాడుడు అవసరమా..? ఎథిక్స్ తో రాజకీయాల్లో ఉన్న కుటుంబం కేవలం రాహుల్ గాంధీ కుటుంబమే. బ్రిటిష్ పాలన లో కూడా లక్షల కోట్లు- ఆస్తులు ధారాదత్తం చేసిన కుటుంబం రాహుల్ గాంధీ కుటుంబం. బీఆర్ఎస్ ఢిల్లీకి సంచులు మోయలేదా..? ఢిల్లీ.. ఒరిస్సా.. పంజాబ్.. కర్ణాటక.. తమిళనాడు.. డబ్బులు పంపింది నువ్వు కాదా..? ఆరేడు రాష్ట్రాలకు సంచులు పంపింది కేసీఆర్ కాదా..?అని జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు.

## తెలంగాణ ఇచ్చిన సోనియాను దేవత అనలేదా

నల్గొండ:తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ నే విమర్శిస్తావా అని కేసీఆర్ తీరును మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కమార్ రెడ్డిలు ప్రశ్నించారు. కేసీఆర్ పదేండ్లలో 10 వేల అబద్ధాలు ఆడారని వారు విర్శించారు. ఏ మోహం పెట్టుకుని కాంగ్రెస్ ను విమర్శిస్తున్నారని ప్రశ్నించారు. తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ దేవత అని కేసీఆర్ గతంలో అనలేదా అని ప్రశ్నించారు. సోనియా కాళ్లు మొక్కిన వ్యక్తి కేసీఆర్ అని కోమటిరెడ్డి అన్నారు. పదేండ్లలో కేసీఆర్ అక్రమంగా 10 లక్షల కోట్లు సంపాదించారని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో అవినీతికి పాల్పడిన అధికారులు కొందరు జైల్లో ఉంటే మరి కొందరు అమెరికాలో ఉన్నారని విమర్శించారు. తాము అబద్ధాలు చెప్పి ఉంటే ఎప్పుడో అధికారం లోకి వచ్చే వాళ్లమన్నారు. మేం తల్చుకుంటే బీఆర్ఎస్ కంటే తలదన్నే మీటింగ్ పెట్టగలమన్నారు. తెలంగాణ ఇచ్చిన దేవత సోనియాగాంధీ అని కేసీఆర్ అనలేదా అని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రశ్నించారు. ఇప్పుడు ఆయనే.. తెలంగాణ విలన్ కాంగ్రెస్ పార్టీ అని దారుణంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తెలంగాణ ఇచ్చినప్పుడు కుటుంబ సమేతంగా వెళ్లి సోనియాగాంధీ ఆశీస్సులు తీసుకోలేదా? హైదరాబాద్‌తో కూడిన తెలంగాణను సోనియాగాంధీ ఇచ్చారని అసెంబ్లీలో కేసీఆర్ అనలేదా? ఇచ్చిన ప్రతి హామీని ఈ ప్రభుత్వం క్రమక్రమంగా నెరవేరుస్తోంది. కేసీఆర్ పదేళ్లు అధికారంలో ఉండి రూ.10వేల కోట్లు- దోచుకుతిన్నారు. ధరణి పోర్టల్ తీసుకొచ్చి వేల ఎకరాలు ఆక్రమించుకున్నారు. మంత్రులు, అధికారుల ఫోన్లు ట్యాపింగ్ చేయించి.. అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. పదేళ్లు పాలించిన కేసీఆర్.. ఉద్యోగులకు సరిగా జీతాలు కూడా ఇవ్వలేదని విమర్శించారు. మరో దశాబ్ధం నల్గొండ కాంగ్రెస్ దేనన్నారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. అభివృద్ధి విషయంలో తాము ఎక్కడా రాజీపడబోమన్నారు. నల్గొండకు రూ. 700 కోట్లతో రింగ్ రోడ్డు నిర్మిస్తున్నామనిచెప్పారు ఉత్తమ్. కాంగ్రెస్ పార్టీకి ఉమ్మడి నల్గొండ జిల్లా కంచుకోట అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. భవిష్యత్‌లోనూ కాంగ్రెస్‌ను సమర్థంగా నడిపించే నేతలు ఈ జిల్లాలో ఉన్నారని చెప్పారు. నల్గొండ కలెక్టరేట్‌లో అదనపు బ్లాక్ శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నల్గొండ పట్టణాన్ని మంత్రి కోమటిరెడ్డి అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారని కితాబిచ్చారు. గత భారాస ప్రభుత్వం నల్గొండ జిల్లాను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. డిండి, ఏదుల ప్రాజెక్టులను కేసీఆర్ పదేళ్లపాటు పట్టించుకోలేదు. ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులను పదేళ్లపాటు- కేసీఆర్ పట్టించుకోలేదు. ఈ ప్రభుత్వం మళ్లీ పని ప్రారంభించిన కొన్ని రోజులకే దురదృష్టవశాత్తు ప్రమాదం జరిగింది. ఇప్పటికైనా ఎస్ఎల్‌బీసీని పూర్తి చేసి తీరుతాం. మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు నల్గొండ జిల్లా నాయకులం ముక్తకంఠంతో మద్దతు తెలుపుతున్నాం. ప్రాజెక్టులకు భూసేకరణ విషయంలో ప్రజలు సహకరించాలి. రైతులను ఒప్పించిన తర్వాతే ప్రాజెక్టులకు భూసేకరణ చేస్తాం. డిండి ఎత్తిపోతల పథకాన్ని సంస్థాన్‌నారాయణపురం, చౌటు-ప్పల్ వరకు పొడిగిస్తాం. పూడిక వల్ల ఎస్ఆర్ఎస్పీ ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం తగ్గింది. ఎస్ఆర్ఎస్పీ ఫేజ్-2 పనులను పూర్తి చేస్తే.. ఉమ్మడి నల్గొండ జిల్లాకు నీటి సమస్య తీరుతుంది. సాగునీటి రంగంలో రూ.1.81 లక్షల ఖర్చు చేసి, భారాస నేతలు జేబులు నింపుకొన్నారు. భారాస నేతల కమీషన్ల కక్కుర్తి వల్లే, రూ.లక్ష కోట్లకుపైగా ఖర్చు చేసిన కాళేశ్వరం నాణ్యత లోపించి మూడేళ్లలోనే కూలిపోయింది.

# పర్యాటకుల ప్రాణాలు కాపాడలేకపోయాం

**శ్రీనగర్:** పహల్గామ్ ఉగ్ర దాడిని ఖండిస్తూ జమ్మూకాశ్మీర్ అసెంబ్లీ తీర్మానం చేసింది. మృతులకు ఘనంగా నివాళి అర్పించింది. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఆసక్తికర ప్రసంగం చేశారు. పహల్గామ్ ఉగ్ర దాడి తర్వాత దేశంలోని ప్రతి ప్రాంతం ఆవేదనకు గురైందన్నారు. ఉత్తరం నుంచి దక్షిణం వరకు.. తూర్పు నుంచి పడమర వరకు ఇలా ప్రతి ప్రాంతం దిగ్భ్రాంతికి గురైందని గుర్తుచేశారు. ఉగ్ర దాడి తర్వాత కాశ్మీర్ అంతా ఐక్యంగా ఉందని గుర్తుచేశారు. ఇక లోయలో ఉగ్రవాదం అంతం కావడం ఖాయమన్నారు. ఇక ఉగ్ర దాడిలో చనిపోయిన 26 మంది పేర్లను సభలో చదివి వినిపించారు. ఈ దాడిలో తండ్రులను కోల్పోయిన పిల్లలకు తాను ఏం సమాధానం చెప్పాలని ఒమర్ అబ్దుల్లా వ్యాఖ్యానించారు. ప్రభుత్వం బాధ్యతగా పర్యాటకులను ఆహ్వానించింది.. కానీ వారికి భద్రత కల్పించలేకపోయామన్నారు. క్షమాపణ చెప్పడానికి కూడా మాటలు రావడం లేదని.. తండ్రులను కోల్పోయిన పిల్లలకు గానీ.. భర్తలను కోల్పోయిన వితంతువులకు ఏం సమాధానం చెప్పాలన్నారు. తాము ఏం తప్పు చేశామని వాళ్లంతా అడుగుతున్నారని.. సమాధానం చెప్పలేకపోతున్నామని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. అతిథులను కాపాడటంలో తాను విఫలమయ్యానని జమ్మూకశ్మీర్‌కు ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా అసెంబ్లీ వేదికగా ప్రకటించారు. కానీ, ఆ 26 మంది ప్రాణాలను అడ్డం పెట్టుకొని తాను రాష్ట్రహోదాను డిమాండ్ చేయబోనని



హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని జాతి తీవ్ర వేదనల్లో ఉన్నప్పుడు కాకుండా.. మరేదైనా రోజు లేవనెత్తుతానని చెప్పారు.

పహల్గాం దాడిపై చర్చించేందుకు అక్కడి అసెంబ్లీ నేడు అత్యవసరంగా సమావేశమైంది. ఈ సందర్భంగా ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ ఇలాంటి దాడులు గతంలో చాలా చూశాం. కానీ, బైసరన్‌లో ఇంత పెద్ద స్థాయిలో దాడి చేయడం మాత్రం 21 ఏళ్లలో ఇదే తొలిసారి. మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు ఎలా క్షమాపణలు చెప్పాలో కూడా తెలియడం లేదు.

రాష్ట్రానికి వచ్చిన పర్యాటకులను సురక్షితంగా తిరిగి పంపాల్సిన బాధ్యత మాదే. నేను ఆ పనిచేయలేకపోయాను. క్షమాపణలు చెప్పేందుకు నా వద్ద మాటలు కరవయ్యాయిపహల్గాం ఘటన తర్వాత ఏ ముఖం పెట్టు-కొని రాష్ట్రహోదాను డిమాండ్ చేయాలి. నా రాజకీయాలు అంత చౌకబారువి కాదు. గతంలో

రాష్ట్ర హోదా అడిగాము.. భవిష్యత్తులో కూడా అడుగుతాము. కానీ, 26 మంది చనిపోయారు.. ఇప్పుడు రాష్ట్ర హోదా ఇవ్వండి అని కేంద్రాన్ని అడగడం సిగ్గుచేటన్నారు. ప్రజలు మాకు మద్దతు ఇస్తే.. మిలిటెన్సీ, ఉగ్రవాదం అంతమవుతాయి. ఇది దానికి ఆరంభం. ఈ ఉద్యమానికి హాని కలిగించేది ఏదీ మాట్లాడకూడదు, చేయకూడదు. మేము మిలిటెన్సీని తుపాకులతో అదుపు చేయగలం.. కానీ, మాకు ప్రజల మద్దతు అవసరం అని అబ్దుల్లా అసెంబ్లీలో పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, పర్యాటకశాఖ మంత్రిగా వారి కాపాడలేకపోయానన్నారు.

ఏప్రిల్ 22వ తేదీన పహల్గాంలోని బైసరన్ లోయలో సేదతీరుతున్న పర్యాటకులను ఉగ్రవాదులు కాల్చి చంపారు. ఈ క్రమంలో వారి మతం అడిగి మరీ ఈ దారుణానికి ఒడిగట్టడం సంచలనంగా మారింది.

ప్రభుత్వ చర్యలకు ప్రతిపక్ష నాయకుడు సునీల్ శర్మ ప్రశంసించారు. అలాగే ఉగ్రవాద దాడిని ఖండించారు. అఖిలపక్ష సమావేశాన్ని పిలిచినందుకు ముఖ్యమంత్రిని, ప్రత్యేక సమావేశాన్ని పిలిచినందుకు అసెంబ్లీ స్పీకర్ అబ్దుల్ రహీం రాథర్‌ను ప్రశంసించారు.



# సిఎస్‌గా రామకృష్ణారావు నియామకం

### సిఎం రేవంత్‌ను కలిసిన కొత్త సిఎస్

### హెచ్ఆర్‌డి వైస్ ఛైర్‌పర్సన్‌గా శాంతికుమారి

**హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి కె. రామకృష్ణారావును నియమించింది. ప్రస్తుత సీఎస్ శాంతికుమారి ఈ నెల 30 పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో తాజాగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం రామకృష్ణారావు ఆర్థిక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కొత్త సీఎస్ నియామకంపై గత కొంత కాలంగా ప్రభుత్వం తీవ్ర కసరత్తు చేసింది. సీనియారిటీ- జాబితా ప్రకారం.. రామకృష్ణారావుతోపాటు- ఆరుగురు అధికారులు రేసులో నిలిచారు. వారందరి పేర్లను పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం సమర్థత, అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని 1991 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన రామకృష్ణారావును సీఎస్‌గా నియమించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఆయనను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ క్రమంలో రామకృష్ణారావు సోమవారం సిఎం రేవంత్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సిఎం ఆయనను అభినందించారు. ఇదిలావుంటే పదవీవిరమణ చేస్తున్న సీఎస్ శాంతి కుమారికి కీలక బాధ్యత అప్పగించారు. డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సం(ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీ) వైస్ ఛైర్‌పర్సన్ గా శాంతి కుమారి పేరును ప్రభుత్వం ప్రకటించింది. సీఎస్ పదవి విరమణ తర్వాత.. ఆమె ఈ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ డీజీగా అదనపు బాధ్యతలు అప్పగించింది. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా కీలక



## లోకాయుక్త, ఉపలోకాయుక్తల ప్రమాణం



### రాజ్‌భవన్‌లో ప్రమాణం చేయించిన గవర్నర్

## కాశ్మీర్‌లో కొనసాగుతున్న ఉగ్రవాదుల వేట

శ్రీనగర్: ఓ వైపు పహల్గాం ఉగ్రవాదుల కోసం భద్రతా దళాల వేట ముమ్మరంగా సాగుతోంది. మరోవైపు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో ఉగ్రస్థావరాలను, పాక్ తరలిస్తోందని సమాచారం అందుతోంది. ఇక పహల్గామ్ నిందితుల్లో ఇప్పటికే ఆ నలుగురి లొకేషన్లను నాలుగుసార్లు ట్రాక్ చేయగా.. వారు త్రుటిలో తప్పించుకొన్నారు. ఒకసారి భద్రతా దళాలు.. ఉగ్రవాదులకు మధ్య కాల్పులు కూడా చోటుచేసుకొన్నాయి. దక్షిణ కశ్మీర్లోని అడవుల్లో దళాలు పలు సందర్భాల్లో వారికి అత్యంత దగ్గరగా వచ్చాయని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రిక పేర్కొంది. ముఖ్యంగా స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్ ఎప్పటికప్పుడు వారి లొకేషన్లను గుర్తిస్తున్నారు. వారు మా కనుచూపు మేరలోకి వచ్చినా.. కాల్పులు జరిపి తప్పించుకొంటున్నారు. ఇక్కడ అడవులు అత్యంత చిక్కగా ఉన్నాయి. మనకు కనిపిస్తున్నా.. ధ్రువీకరించుకోవాల్సి ఉంటుంది. వారిని పట్టుకొని తీరతాం. కొన్ని రోజులు మాత్రమే మిగిలిఉందని ఓ సైనిక అధికారి వ్యాఖ్యానించారు. ఉగ్రవాదులను తొలుత అనంతనాగ్‌లోని పహల్గాం తెహస్లీ వద్ద గుర్తించారు. కానీ, దళాలు అక్కడికి చేరేలోపు వారు చిక్కటి అడవుల్లోకి పారిపోయారు. ఆ తర్వాత కుల్గాం అడవుల్లో వారి కదలికలు కనిపించాయి. అక్కడికి చేరుకొన్న భద్రతా దళాలపై కాల్పులు జరిపి పారిపోయారు. అనంతరం తిరిగి త్రాల్ కొండల్లో వారు ఉన్నట్లు-దళాలు గుర్తించాయి. అక్కడి నుంచి

వారు జారుకొన్నాక కొకెర్నాగ్‌లో లొకేషన్ బయటపడింది. వారు ప్రస్తుతం ఈ ప్రాంతం చుట్టు-పక్కలే ఉండొచ్చని చెబుతున్నారు. ఒక గ్రామంలోని ఇంట్లో వారు రాత్రి భోజనానికి వెళ్లగా అక్కడికి దళాలు చేరుకోవడంతో.. ఆహారం తీసుకొని వారు పారిపోయినట్లు- సైనికాధికారి వెల్లడించారు. ప్రస్తుతం ఉగ్రవాదులు తమకు అవసరమైన నిత్యావసరాల సేకరణలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. సాధారణంగా వీరు గ్రామాల సమీపంలోకి వెళ్లినప్పుడు అక్కడ ఉండే స్థానిక సహాయకులను సంప్రదించి అడవుల్లోకి ఆహారం తెప్పించుకొంటారు. ఆ సమయంలో దళాలకు హ్యూమన్ ఇం-టె-లిజెన్స్ లభిస్తుంది. కానీ వీరు చాలా అప్రమత్తంగా ఉన్నారని అధికారులు చెబుతున్నారు. ఉగ్రవాదులు కిష్త్వార్ ప్రాంతంలోకి ప్రవేశిస్తే.. భద్రతా దళాలకు సమస్యలు రావొచ్చని భావిస్తున్నారు. ఇక్కడి పర్వతాలు పహల్గాం వైపు శిఖరాలతో కలిసి ఉంటాయి. తక్కువ మంచు ఉండటంతో.. ఉగ్రవాదులు అక్కడి నుంచి వారు చిక్కటి అడవులు ఉన్న జమ్మూ ప్రాంతంలోకి ప్రవేశించడానికి అవకాశం లభిస్తుంది. ప్రస్తుతం ఆర్మీ, సీఆర్పీఎఫ్, జమ్మూకశ్మీర్ పోలీసులు పహల్గాం చుట్టు-పక్కల అడవులను జల్లెడ పడుతున్నారు. ఉగ్రవాదులు బైసరన్ లోయలో కొందరు సందర్శకుల నుంచి మొబైల్ ఫోన్లు లాక్కొన్నారు. తమ వారితో మాట్లాడేందుకు వాటిని వాడొచ్చన్న అనుమానాలు ఉండటంతో టె-క్నికల్ ఇంటెలిజెన్స్ బృందాలు అత్యంత అప్రమత్తంగా ఉన్నాయి. పహల్గాం ఉగ్రదాడితో భారత్- పాకిస్థాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. భారత్ తగిన సమాధానం ఇచ్చే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ తరుణంలో పీవోకేలోని ఉగ్రవాద లాంచ్ ప్యాడ్‌లను పాకిస్థాన్ సైన్యం ఖాళీ చేయిస్తున్నట్లు తెలుస్తోంది. వారిని ఆర్మీ షెల్టర్లు, బంకర్లకు తరలించడం ప్రారంభించింది. ఈ మేరకు నిఘా వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియాలో కథనం ప్రచురితమైంది.

భారత భద్రతా సంస్థలు క్రియాశీలకంగా ఉన్న పలు లాంచ్‌ప్యాడ్‌లను గుర్తించిన నేపథ్యంలో పాక్ ఈ చర్యలు తీసుకుంటు-న్నట్లు- తెలుస్తోంది. పీఓకేలోని కెల్, సర్ది, దుధ్నియల్, అత్ముఖం, జురా, లిపా, పచ్చిబన్, ఫార్వర్డ్ కహుత, కొట్లి వంటి పలు ప్రాంతాల నుంచి ఉగ్రవాదులను తరలిస్తున్నట్లు- నిఘా వర్గాల సమాచారం. ఉగ్రవాదులు జమ్మూకశ్మీర్‌లోకి చొరబడటానికి ముందు వారు నివసించే కీలక కేంద్రాలుగా ఈ లాంచ్‌ప్యాడ్స్ పనిచేస్తాయి. వీటిలో 150 నుంచి 200 మంది శిక్షణ పొందిన ఉగ్రవాదులు ఉన్నారని, వారంతా చొరబాటుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నాయి. పహల్గాం లో ఏప్రిల్ 22న పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన పాశవిక దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనతో భారత్, పాక్‌ల ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

# ఖజానా ఖాళీ చేసి మాపై నిందలా..?

అభద్రతాభావంతో మాట్లాడారు. ఆయన ప్రసంగంలో స్పష్టత లేదు. రాహుల్‌గాంధీకి, నాకు గ్యాప్ ఉందనడం అవాస్తవం. రాహుల్‌కు, నాకు ఉన్న అనుబంధం ప్రపంచానికి చెప్పనవసరం లేదు. అవసరాలను బట్టి కేసీఆర్, మోదీ మాటలు మారుస్తున్నారు. దేశానికి ఇందిరాగాంధీ లాంటి ప్రధాని కావాలని రేవంత్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యేలు ప్రజల్లోకి వెళ్లాలి. ఎమ్మెల్యేలు వెళ్తేనే.. ప్రజల్లోకి పథకాలు వెళ్తాయి. పార్టీలో ఓపికగా ఉంటే పదవులు వస్తాయి. ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే పార్టీ నేతలే నష్టపోతారని రేవంత్ హెచ్చరించారు. కేసీఆర్ సభకు అవసరమైనన్ని బస్సులు సమకూర్చినప్పటికీ, గతంలో ఖమ్మంలో రాహుల్ గాంధీ సభకు బస్సులు ఇవ్వకపోవడం మోసపూరిత చర్య అని మండిపడ్డారు.ఫోన్ ట్యాపింగ్ కేసుల గురించి రేవంత్ మాట్లాడుతూ.. చట్టం మేరకే చర్యలు తీసుకుంటామని, కేసీఆర్ లాగా నేను చట్టాన్ని అతిక్రమించను అని ఆయన అన్నారు. కేటీఆర్ మీద ఉన్న కేసులు కూడా చట్ట ప్రకారమే సాగిస్తామని స్పష్టం చేశారు. కాగా, అసెంబ్లీ సమావేశాల్లో తాను చేసిన వ్యాఖ్యలే కేసీఆర్ సభలో పునరావృతం చేశారని



విమర్శించారు. కొంత మంది అధికారుల పని తీరు తెలిసినా, అవసరంగా ఉన్న కారణంగా వారి సేవలను కొనసాగించాల్సి వస్తోందన్నారు. కలెక్టర్ల మార్పు వేరే విషయమని, అవసరమైన మార్పులు చేసుకుంటామని వివరించారు. నన్ను నమ్ముకున్న వారిని నేను ఎప్పటికీ మర్చిపోనని, నన్ను నమ్మిన వారిలో ఒకరైన దయాకర్‌కు ఎమ్మెల్సీ పదవి వచ్చిందని చెప్పారు. ఓపికగా ఉన్న వారికే తన నుండి బాధ్యతలు వస్తాయని, బయటకి వెళ్లి విమర్శలు చేస్తే తనపై బాధ్యత ఉండదని అన్నారు. ఈ సందర్భంగా మావోయిస్టుల అంశంపై జానారెడ్డితో చర్చ జరిగినట్లు చెప్పారు. గతంలో మావోయిస్టులతో చర్చలు నిర్వహించిన అనుభవం జానారెడ్డి, కేకేలకు దగ్గర ఉందని, ఇప్పుడు కూడా అదే విధంగా వ్యవహరించేందుకు అధిష్టానం నిర్ణయాన్ని ఎదురుచూస్తున్నామని వెల్లడించారు. పార్టీ హైకమాండ్ కు సమాచారం

ఇచ్చి, పీస్ కమిటీ రిక్వెస్ట్ పంపిస్తామని తెలిపారు. జానారెడ్డితో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. మావోయిస్టులతో చర్చల కోసం శాంతి కమిటీ ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా సీఎం అన్నారు. మావోయిస్టుల అంశంపై జానారెడ్డి, కే కేశవరావు పార్టీలో చర్చిస్తారని తెలిపారు.

## తిరుపతి జిల్లాలో ఘోరరోడ్డు ప్రమాదం

తిరుపతి: ఆంధ్రప్రదేశ్‌లో మరో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది.. తిరుపతిలో జిల్లాలో జరిగిన ఈ ప్రమాదంలో అక్కడిక్కడే ఐదుగురు మృతిచెందారు.. ఈ ఘటనలో మరో ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి..



పూతలపట్టు- నాయుడుపేట జాతీయ రహదారిపై పాకాల మండలం తోటపల్లి దగ్గర ఘోరు ప్రమాదం చోటు చేసుకుంది.. కం-టైనర్ వాహనం కిందకు దూసుకెళ్లింది కారు.. ఈ ఘటనలో ఐదుగురు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు.. ప్రమాదంలో మరో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా.. వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.. మృతుల్లో ఇద్దరు పురుషులు, ఇద్దరు మహిళలు, 9 ఏళ్ల బాలుడు ఉన్నట్టు పోలీసులు చెబుతున్నారు.. అందరూ ఒకే కుటుంబానికి చెందిన వారిగా గుర్తించారు.. ప్రమాదానికి గురైన వాహనం.. తమిళనాడు రిజిస్ట్రేషన్ నంబర్ కలిగి ఉండడంతో.. మృతులు కూడా ఆ రాష్ట్రానికి చెందినవారిగానే అనుమానిస్తున్నారు..

## చెత్త సేకరణకు అధిక ప్రాధాన్యం మంత్రి నారాయణ వెల్లడి

విజయవాడ: చెత్త సేకరణకు మున్సిపల్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి నారాయణ తెలిపారు. సోమవారం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో కెపాసిటీ- బిల్డింగ్, బిహేవియరల్ చేంజ్‌పై ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. వర్క్ షాప్‌నకు మంత్రి నారాయణ, కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్, మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులు, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు. మున్సిపాలిటీల్లో సాలిడ్ వేస్ట్, లిక్విడ్ వేస్ట్ తొలగించడం ఎంతో సవాల్‌తో కూడినదని అన్నారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో 6500 టన్నుల సాలిడ్ వేస్ట్ ప్రతి రోజూ వస్తుందని చెప్పారు. ఏరోజు కారోజు ఈ చెత్తనంతా తొలగించాలని అన్నారు. గత జగన్ ప్రభుత్వం 80 లక్షల టన్నుల చెత్తను వదిలి వెళ్లిందని మంత్రి నారాయణ అన్నారు.




## గేట్ వే ఆఫ్ అమరావతిగా బందరు పోర్టు

మచిలీపట్నం: గేట్ వే ఆఫ్ అమరావతిగా బందరు పోర్టు మారేందుకు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని మంత్రులు అన్నారు. ఇన్లాండ్ వాటర్ వేస్ అభివృద్ధి చేయడం ద్వారా అమరావతి నిర్మాణంలో కూడా పోర్టు భాగస్వామిగా మారబోతోందన్నారు. పోర్టు పనులు త్వరగా పూర్తి చేయడం ద్వారా పోర్ట్ బేస్డ్ ఇండస్ట్రీలు కూడా ఎక్కువగా మచిలీపట్నంలో ఏర్పడేందుకు అవకాశాలు ఉంటా యన్నారు. మచిలీపట్నంలో పోర్టు పనులను మంత్రులు కొల్లు రవీంద్ర , బీసీ జనార్దన్ రెడ్డిలు పరిశీలించారు. ఈ సందర్భంగా పోర్టు నిర్మాణ స్థితిని మంత్రులకు కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులు వివరించారు. ఈ క్రమంలో సోమవారం మంత్రులు కొల్లు రవీంద్ర, బీసీ జనార్దన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ..

ఇప్పటి వరకు నాలుగు బెర్తుల పనులు, రోడ్డు పనులు, విజయవాడకు అనుసంధానించే పనులు 40 శాతం పూర్తయ్యాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పోర్టు పనులపై ఎప్పటికప్పుడు సమీక్ష చేస్తున్నారని, మరోవైపు బందరులో టూరిజం హబ్ ఏర్పాటు పనులు చేస్తున్నామని, సర్ఫ్యాట్ టూరిజం అభివృద్ధి చేసి ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రులు కొల్లు రవీంద్ర, బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. మార్చి 2026 నాటికి మచిలీపట్నం ఫిషింగ్ హార్బర్ పూర్తి చేయాలనే లక్ష్యంతో

కాల పరిమితి పొడిగింపు చేశాం అని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వంలో ఫిషింగ్ హార్బర్ పనులు నిలిచిపోయాయని, హార్బర్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలనే ఆలోచనతో దాదాపు రూ.422 కోట్లతో నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. ఇప్పటికే దాదాపు 57 శాతం పనులు పూర్తయ్యాయి కానీ కీలకమైన పనుల్లో జాప్యం జరిగిందన్నారు.

# మే 8 నుండి 16వ తేదీ వరకు బూరగమంద శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు





**తిరుపతి ,ఉత్తేజిత ప్రతినిధి,ఏప్రిల్ 28.**

చిత్తూరు జిల్లా సదుం మండలం బూరగమంద గ్రామంలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు మే 8 నుండి 16వ తేదీ వరకు వైభవంగా జరుగనున్నాయి. మే 7న సాయంత్రం అంకురార్పణం నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల్లో ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు తిరుచ్చి ఉత్సవం, రాత్రి 8 గంటలకు వాహనసేవలు జరుగనున్నాయి. మే 17వ తేదీన సాయంత్రం 5 గంటలకు పుష్పయాగం నిర్వహిస్తారు.బ్రహ్మోత్సవాల్లో వాహనసేవల వివరాలు :08-05-2025 - సాయంత్రం - ధ్వజారోహణం 09-05-2025 - సాయంత్రం - శేష వాహన10-05-2025 - సాయంత్రం - హంస వాహనం11-05-2025 - సాయంత్రం - హనుమంత వాహనం12-05-2025 - సాయంత్రం - కల్యాణోత్సవం, గరుడ వాహనం13-05-2025 - సాయంత్రం - పుష్ప పల్లకి14-05-2025 - సాయంత్రం - సింహ వాహనం15-05-2025 - సాయంత్రం - అశ్వవాహనం16-05-2025 - ఉదయం - చక్రస్నానం, సాయంత్రం - గజ వాహనం, ధ్వజావరోహణం ఈ సందర్భంగా హిందూ ధర్మప్రచార పరిషత్, దాససాహిత్య ప్రాజెక్టు, అన్నమాచార్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ప్రతిరోజూ భక్తి సంగీత కార్యక్రమం, హరికథాగానం, కోలాటాలు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

# ఏప్రిల్ 30న శ్రీవారి సేవ జూన్ నెల కోటా ఆన్‌లైన్‌లో విడుదల



శ్రీవారి సేవ స్వచ్ఛంద సేవ జూన్ నెల ఆన్‌లైన్ కోటాను ఏప్రిల్ 30న టీటీడీ విడుదల చేయనుందివిడుదల సమయ వివరాలు: తిరుమల, ఉత్తేజిత ప్రతినిధి, ఏప్రిల్ 28 జనరల్ శ్రీవారి సేవ (తిరుమల మరియు తిరుపతి) %-% ఉదయం 11:00 గంటలకునవనీత సేవ (మహిళలకు మాత్రమే) %-% మధ్యాహ్నం 12:00 గంటలకు పరకామణి సేవ (పురుషులకు మాత్రమే) %-% మధ్యాహ్నం 1:00 గంటలకుగ్రూప్ లీడర్ సేవ (కొత్తగా ప్రారంభించిన సేవ) %-% మధ్యాహ్నం 2:00 గంటలకుఆంధ్రప్రదేశ్ గౌరవ ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి సూచనల మేరకు శ్రీవారి సేవ యొక్క నాణ్యతను మెరుగుపరిచి భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో టీటీడీ అధికారులు శ్రీ సత్యసాయి సేవా సంస్థ (పుట్టపర్తి), ఇషా ఫౌండేషన్ (కోయంబత్తూర్), ఆర్ట్ ఆఫ్ లివింగ్ (బెంగళూరు) వంటి ప్రఖ్యాత సంస్థలను సందర్శించి అధ్యయనం చేశారు.ఈ అధ్యయనం ఆధారంగా శ్రీవారి సేవలో కొన్ని ముఖ్యమైన మార్పులను టీటీడీ తీసుకొచ్చింది. ఈ మార్పులు ఏప్రిల్ 30న కొత్తగా రూపొందించినఅప్లికేషన్ ద్వారా అమలులోకి రానున్నాయి.ముఖ్యాంశాలుఇకపై "గ్రూప్ లీడర్స్‌గా" సీనియర్ సేవకులుగత రెండు సంవత్సరాలుగా పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగులు సేవలో పాల్గొంటున్నారు. వయస్సు 45 సంవత్సరాలు నుంచి 70 సంవత్సరాల మధ్య ఉన్న వారు నమోదు కావచ్చు. ఇప్పుడు వీరిని "గ్రూప్ లీడర్స్" అని పిలుస్తారు. వీరు 15 రోజుల, ఒక నెల లేదా మూడు నెలల వ్యవధిలో సేవ చేయడానికి ఆన్‌లైన్‌లో ఎంపిక చేసుకోవచ్చు.గ్రూప్ లీడర్స్ బాధ్యతలుఈ గ్రూప్ లీడర్స్ శ్రీవారి సేవకుల పనిని పర్యవేక్షించడం, సేవకు వారి హాజరు తీసుకోవడం, మరియు ప్రతి ఒక్క సేవకుని/సేవకురాలి పనితీరును మూల్యాంకనం(%=ఛఅస్త్ర%) చేయడం వంటి బాధ్యతలు నిర్వహిస్తారు.పరకామణి సేవలో జనరల్ పురుష సేవకులకు అవకాశంకనీసం పదో తరగతి విద్యార్హత కలిగిన పురుషులకు పరకామణి సేవలో పాల్గొనేందుకు అవకాశం కల్పించాలని టీటీడీ నిర్ణయించింది. ఈ మేరకు ఆన్ లైన్ ద్వారా పరకామణి సేవను బుక్ చేసుకోవచ్చని తెలియజేయడమైనది.

# నైట్ అవుట్ అలవెన్స్ రూ.400

**- రిలే నిరాహార దీక్షలు చేపట్టిన ఆర్టీసీ కార్మికులు**

**- ఆర్టీసీ కార్మికులకు ప్రమోషన్లు ఇవ్వాలి..**

**- ఎన్ఎంయు డిపో కార్యదర్శి వై.డి.ఆర్ స్వామి**

**- ఎన్ఎంయు నంద్యాల జిల్లా వైస్ ప్రెసిడెంట్ పబ్బతి సుధాకర్**




**నందికొట్కూరు ఉత్తేజిత ప్రతినిధి ఏప్రిల్ 28**

-: రాష్ట్రవ్యాప్తంగా వివిధ డిపోల్లో పనిచేస్తున్న ఆర్టీసీ కార్మికులకు వెంటనే ప్రమోషన్ ఇవ్వాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ నంద్యాల జిల్లా వైస్ ప్రెసిడెంట్ పబ్బతి సుధాకర్ , డిపో కార్యదర్శి వైడిఆర్ స్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక నందికొట్కూరు ఆర్టీసీ డిపో ముందు ఆర్టీసీ కార్మికులు ఎం .రామస్వామి( కండక్టర్) , డిఏ .రజాక్( కండక్టర్), డి .శేఖర్ ( డ్రైవర్), కె .రవీంద్ర కుమార్( మెకానిక్ అసిస్టెంట్) రిలే నిరాహార దీక్షలు చేపట్టారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1/2019 యధావిధిగా అమలు చేయాలని, నైట్ అవుట్ అలవెన్స్ రూ.150 నుంచి కిలోమీటర్లు బట్టి 300 నుండి 400 వరకు పాత పద్ధతిలో ఇవ్వాలన్నారు. గ్యారేజీ కార్మికులకు పనిష్మెంట్లు తగ్గించాలన్నారు. డిపోలో సస్పెన్షన్ లు ఎత్తివేయాలి అన్నారు . కార్మికులకు వెంటనే ప్రమోషన్ ఇవ్వాలన్నారు సివిల్ అసిస్టెంట్ సర్జన్ గవర్నమెంట్ వారు ఇచ్చిన సిక్కులకు జీతాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుదాస్, రత్నం జనార్ధన్ , కుమార్ , విజయుడు, గ్యారేజీ సెక్రెటరీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ కు రెండు ఏసీలు, 5 వాటర్ డిస్పెన్సర్లు

**జిల్లా కలెక్టర్ కు అందజేసిన కెనరా బ్యాంక్ అధికారులు**

**నంద్యాల, ఏప్రిల్ 28:-**

కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద కెనరా బ్యాంక్ అధికారుల బృందం జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గారికి ప్రజల సౌకర్యార్థం రెండు ఏసీలు, 5 వాటర్ డిస్పెన్సర్లు అందజేశారు. సోమవారం కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్ లకు ప్రజల సౌకర్యార్థం రెండు ఏసీలు, 5 వాటర్ డిస్పెన్సర్లను కర్నూలు లీడ్ డిస్టిక్ మేనేజర్ రామచంద్ర, నంద్యాల కెనరా బ్యాంక్ చీఫ్ మేనేజర్ లు సుబోధ్, టి. అనంత్, రాకేష్ రంజన్, కర్నూల్ బ్రాంచ్ డివిజనల్ మేనేజర్ సురేష్ కుమార్, నంద్యాల మెయిన్ బ్రాంచ్ ఆఫీసర్ శివశంకర్ తదితరులు పరికరాలను అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద కెనరా బ్యాంక్ అధికారుల బృందం జిల్లా కేంద్రానికి పరికరాలు అందజేయడం సంతోషదాయకమని కోరుకుంటూ కెనరా బ్యాంక్ అధికారులకు అభినందనలు తెలిపారు. వేసవి ఉష్ణోగ్రతల దృష్ట్యా కలెక్టరేట్ లోని విజిటర్స్ లాబిన్ లో ప్రజలకు వేసవి తాపాన్ని తగ్గించేందుకు ఒక టవర్ ఏసితో సాధారణ ఎసినీ కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. అలాగే పిజిఆర్ఎస్ హాలులో 5 వాటర్ డిస్పెన్సర్లను అర్జీదారుల దాహార్తిని తీర్చేందుకు వినియోగిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయక్, సెక్షన్ సూపర్డెంట్లు తదితరులు పాల్గొన్నారు.డిపిఆర్ఓ, నంద్యాల వారి ద్వారా జారీ

# నందికొట్కూరు టీడీపీ లో వర్గాలు లేవు..!

**- ఎమ్మెల్యే గిత్త జయసూర్య.**

**నందికొట్కూరు ఉత్తేజిత ప్రతినిధి ఏప్రిల్ 28**



-: నియోజకవర్గం లోని టీడీపీలో వర్గ విబేధాలు లేవని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రతి ఒక్కరు టీడీపీ వర్గమని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య అన్నారు. నందికొట్కూరు పట్టణంలో రోడ్డు భవనాల శాఖ విశ్రాంతి భవనములో సోమవారం ఎమ్మెల్యే జయసూర్య ఆధ్వర్యంలో టీడీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సాదికారిక సారధులు, మరియు త్వరలో నియమించే వార్డు మరియు పట్టణ అనుబంధ కమిటీలపై చర్చించారు.అలాగేనియోజకవర్గంలోని అన్ని బూత్ లలో కుటుంబ సాధికార సారధులను నియమించి గ్రామ,మండల, నియోజకవర్గ స్థాయి కమిటీలను త్వరితగతిన పూర్తి చేసి పార్టీబలోపేతానికి కృషి చేయాలని సూచించారు.అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ పరిశీలకులు దేవళ్ళ మురళి, ఎమ్మెల్యే జయసూర్య మాట్లాడుతూ నందికొట్కూరు నియోజకవర్గంలో టీడీపీ లో వర్గ విబేధాలు లేవని ఉన్నది ఒకటే వర్గమని అదే ఎమ్మెల్యే టీడీపీ వర్గమన్నారు.కష్టపడి టీడీపీ పార్టీకోసం పనిచేసిన ప్రతి కార్యకర్తకు న్యాయం జరుగుతుందన్నారు. టీడీపీలోప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. సమావేశంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రసాద రెడ్డి,యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్, మండల కన్వీనర్లు రమేష్ రెడ్డి, మహేశ్వరరెడ్డి, గిరిశ్వర రెడ్డి, నారపు రెడ్డి, దామోదర్ రెడ్డి, లింగస్వామి గౌడ్, భాస్కర్ రెడ్డి, మూర్తుజావలి, జమీల్, లాయర్ జాకీర్ హుసేన్, ,క్లస్టర్లు, యూనిట్,బూత్ ఇంచార్జ్ లు పాల్గొనడం జరిగినది.

# పన్నుల విధానంతో ధరల స్వారీ !

దేశంలో ఆహార ధరల పెరుగుదల అంతకంతకూ ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల వంటనూనెల ధరలు మరింత ప్రియంగా మారాయి. ఆహారధాన్యాలు ఇబ్బడిముబ్బడిగా పండుతున్నా ప్రజలకు మాత్రం చౌకగా దక్కడం లేదు. పేదవారి పట్ల పార్టీలు వేరైనా పాలకులంతా మొసలి కన్నీరు కారుస్తోంది. కాకమ్మ కబుర్లు చెప్పి కాలం వెళ్లదీస్తున్నాయి. అధికారం కోసం నానాగా గడ్డీ కరుస్తున్నాయి. దేశంలో అన్ని వస్తువుల,సేవల ధరలూ పెరిగిపోతూ వుంటే, దాని ప్రభావాన్ని తట్టుకుని భరించే స్థితిలో సామాన్య ప్రజలు లేరు. ప్రభుత్వాలు తాము పెంచుతున్న ధరలు కావచ్చు..జిఎస్టీ కావచ్చు..గ్యాస్ కావచ్చు సామాన్యులకు భారం పడదన్న ధోరణిలో ఉన్నారు. నిజానికి ఏ వస్తువు అయినా ధరలు వెచ్చించి సామాన్యులు కొనాల్సిందే. ఏకీకృత పన్ను విధానం పేరుతో తీసుకుని వచ్చిన జిఎస్టీ ఇప్పుడు సామాన్యులకు గుదిబండగా మారింది. పాన్, ఆధార్ లింక్ కూడా సామాన్య, మధ్య తరగతి ప్రజలకు భారంగా మారనుంది. దీనికితోడు కనీసం వేయి రూపాయల ఛార్జీ వడ్డిస్తున్నారు. దీనికితోడు తాజాగా యూపిఎ చెల్లింపులపై ట్యాక్స్ విధించే ఆలోచన దుర్మార్గం కాక మరోటి కాదు. అప్పుడెప్పుడో జుట్టు పన్ను కూడా విధించారు. ఇప్పనుడు అదే తరహాలో పన్నులేని పని, వస్తువు, సేవలు లేకుండా పోయాయి. పన్నుల రూపంల ప్రజలు ఇల్లు గుల్ల చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. దీనికి తోడు ఇప్పుడు ధరలు సవారీ చేస్తున్నాయి. బంగారం, వెండి ధరలకు అడ్డూ అదుపు లేకుండా పోతున్నాయి. ఇవి ప్రభుత్వ అజమాయిషీ లేని జాబితాలో చేరాయి. వారి ఆదాయాలు పెరగకుండా ధరల పెరుగుదల ను భరించే స్థితిలో ప్రజలు ఉన్నారా లేరా..అన్నది కూడా పాలకులు ఆలోచన చేయడం లేదు. శ్రామిక వర్గ ఆదాయాలు పెరిగే ధరలకు అనుగుణంగా పెరగగకుంటే ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడం ప్రభుత్వానికి సాధ్యం కాదు. శ్రామిక ప్రజల ఆదాయాలు పెరగవని తెలుసు. పెరగడం లేదని కూడా తెలుసు. భారమంతా శ్రామిక వర్గమే అంతిమంగా భరించాల్సి వస్తుందని కూడా పాలకులు తెలుసు. తెలిసి కూడా పెట్రో,గ్యాస్, జిఎస్టీ ధరల పెరుగుదలకు అడ్డూఅదుపు లేకుండా చేస్తున్నారు. ఇక సామాన్యుల ఇంటికలను ఛిద్రం చేసేసారు. సామాన్యులు సొంతంగా ఇల్లు కట్టుకునే పరిస్థితి లేదు. మరోపక్క అంతర్జాతీయ చమురు ధరలు పెరిగిన ప్రతిసారీ, దేశీయంగా పెట్రో ధరలను పెంచి తీరాలన్న సూత్రం ఏదీ లేదు. కానీ అలా పెంచడం వల్ల ఆదాయం పెంచుకోవాలని ప్రభుత్వం చూస్తోంది. పెట్రోల్ అన్నది ఇప్పుడు కేంద్రానికి ఆదాయవనరుగా మారింది. పెట్రో ధరల పెంపు అనేది ప్రభుత్వం అనుసరించే ద్రవ్య వ్యూహం బట్టి ఉంటుంది. ఈ ద్రవ్య వ్యూహాన్ని ప్రభుత్వం ఎప్పటి కప్పుడు మార్చుకునే వీలున్నా అందుకు కేంద్రం సిద్దంగా లేదు. పెట్రో ధరలను తమకు ఇష్టం లేకున్నా పెంచవలసి వస్తోందని వాపోవడం దొంగనాటకం కాక మరోటికాదు. పెట్రో ఉత్పత్తుల ధరలో దాదాపు సగం భాగం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధించే పన్నులకే పోతుంది. ఈ పన్నులకి, అంతర్జాతీయ చమురు ధరలకి సంబంధం లేదు. అయినా ఆ పన్నులను పెంచుకుంటూ దోచుకుంటున్నారు. రాజకీయ నాయకుల జీతభత్యాలపై మాట్లాడడం లేదు. అనవసర ఖర్చులపై మాట్లాడడం లేదు. తన వంతు అదనంగా ప్రజల మీద కేంద్రంలోని మోడీ ప్రబుత్వం భారాన్ని మోపుతూనే పోతోంది. రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని కొంత వరకూ అర్థం చేసుకోవచ్చు. వాటి పరిధిలో పరిమితమైన ఆదాయ వనరులే ఉన్నాయి. ముఖ్యంగా జి.ఎస్.టి విధానం వచ్చాక రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదాయాన్ని సమకూర్చుకునే మార్గాలు బాగా తగ్గిపోయాయి. పెట్రో ఉత్పత్తులు జిఎస్‌టి పరిధి లోకి రావు. అందుకే ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని రాష్ట్ర ప్రభుత్వాలు తమ వంతు పెట్రో ఉత్పత్తుల మీద పన్నులు వసూలు చేస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రత్యక్ష పన్నులు విధించే అధికారం లేనందువలన వాటికి వేరే దారి లేదు. కాని కేంద్ర ప్రభుత్వం వేరు. వేర్వేరు మార్గాల్లో అదనపు ఆదాయాన్ని సమకూర్చుకునే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. కాని కావాలనే అది ఆ మార్గాలను ఉపయోగించడంలేదు. సంపన్నులమీద ప్రత్యక్ష పన్నులు విధించవచ్చు. ఆ సంపన్నుల పట్ల పక్షపాత వైఖరితో ప్రభుత్వం ఉంది కాబట్టి ఆ ప్రత్యామ్నాయాన్ని అది ఆలోచించడం లేదు. సంపన్న వర్గాలే పెట్రో ఉత్పత్తులను ఎక్కువగా ఉపయోగిస్తాయి గనుక పెట్రో ఉత్పత్తుల మీద ధరలు పెరిగితే వారిమీదే భారం ఎక్కువగా పడుతుందని ఎవరైనా భావిస్తే అది చాలా పొరపాటు. పెట్రో ఉత్పత్తులలో సామాన్య ప్రజలు నేరుగానే వినియోగిస్తారు. ఇందుకు ఉదాహరణ వంట గ్యాస్. ఇక పెట్రో ఉత్పత్తుల ధరలు పెరిగితే రవాణా చార్జీలు అనివార్యంగా పెరుగుతుంటాయి. దానితోబాటు వినిమయ వస్తువుల ధరలన్నీ పెరుగు తాయి. వాటిలో ఆహార ధాన్యాలతో సహా చాలా వస్తువులను ప్రజలే ఎక్కువగా వినియోగిస్తారు. ఇక సంపన్నులు పెట్రో ఉత్పత్తులను వినియోగించి ఉత్పత్తి చేసే వివిధ రకాల సరుకుల రేట్లను పెంచి అమ్ముతారు. ఆ విధంగా కూడా అంతిమంగా వినియోగదారుల పైనే భారం అంతా పడుతుంది. పెట్రో ఉత్పత్తుల వినియోగాన్ని తగ్గించాలని సామాన్య ప్రజలు మాత్రమే కోరుకుంటారు. ఎందుకంటే వారే నేరుగా బాధ్యులు కనుక. వినిమయం తగ్గితే మార్కెట్‌లో మాంద్యం మరింత పెరుగుతుంది. అది మరింత ఎక్కువ గా నిరుద్యోగానికి దారి తీస్తుంది. ఆ విధంగా ఒక వైపు ద్రవ్యోల్బణం, మరోవైపు మాంద్యం ఆర్థికంగా దెబ్బ తీస్తుంది. ప్రభుత్వం పెట్రో ఉత్పత్తుల పంపిణీని నియంత్రించి రేషనింగ్ విధానాన్ని అమలు చేయడం ద్వారా కొంత కంట్రోల్ చేయవచ్చు. నిజాయితీ ఉంటే ప్రత్యామ్నాయ ద్రవ్య విధానాన్ని అమలు చేయడానికి ప్రభుత్వం సిద్ధపడాలి. అదికూడా ప్రజలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయించాలి. అప్పుడే ప్రజలపై భారం పడదు. నిజానికి ప్రజల నుంచి డబ్బులు గుంజడమెలా అన్నది కేంద్రం చేస్తున్న ఆలోచన.. జిఎస్టీతో ప్రజలు అల్లాడుతున్నా..పన్నులు కట్టలేక చస్తున్నా..పెట్రోల్ ధరలతో దాడులు చేస్తున్నా.. పట్టించు కోని ప్రధాని మోడీ రాష్ట్రాలు వ్యాట్ తగ్గించాలని గతంలో చేసిన సూచనలు ప్రజలంతా గమనిస్తున్నారు.

# పెట్రోల్‌పై ఎక్సైజ్, వ్యాట్ ధరలు

న్యూఢిల్లీ: దేశంలో పెరుగుతున్న దరల కారణంగా పెట్రో ధరలను కంట్రోల్ చేస్తే..ఇతరత్రా రవణా ఛార్జీలు తగ్గుతాయి. ఆ మేరకు సరుకులపైనా ధరలు తగ్గుతాయి. ఈ తరహా ఆలోచన చేయడం లేదు. గత ఐదారేళ్లుగా పెట్రో ధరలపై ప్రధాని అవాస్తవాలు చెబుతున్నారు. ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. నిజానికి చమురు కంపెనీలు గనుక ఈ విధంగా ధరలను పెంచిన్నటైతే, అది అక్కడితో ఆగిపోదు. మొత్తం ఆర్థిక వ్యవస్థలో అనేక వస్తువుల ధరలు దాని ఫలితంగా పెరుగుతాయి. కాంగ్రెస్ హయాంలో పెట్రో ధరలపై విరుచుకు పడ్డ మోడీ ఇప్పుడా విషయం మరచిపోయినట్లు ఉన్నారు. ధరల పెరుగుదాల, జిఎస్టీపైనా గుజరాత్ సిఎంగా విమర్శలు గుప్పించిన విషయం ప్రజలు ఇంకా మరచి పోలేదు. నిజానికి కేంద్రంపెట్రోల్‌పై ముందుగా ఎక్సైజ్ డ్యూటీ తగ్గించివుంటే బాగుండేది. ఆ తర్వాత వ్యాట్ తగ్గించమని రాష్ట్రాలకు చెప్పివుంటే మోడీ నిజాయితీగా ఉన్నాడని అనుకునే వారం. మోడీ అధికారంలోకి వచ్చాక లీటర్ పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని రూ.18 కిపైగా పెంచారని కాంగ్రెస్ నేతలు పదేపదే చెబుతూనే వచ్చారు. యూపీఏ హయాంలో లీటర్ పెట్రోల్‌పై రూ.9.84 ఎక్సైజ్ డ్యూటీ ఉండగా.. మోడీ దాన్ని రూ.27.90కు, లీటర్ డీజిల్‌పై రూ.3.56గా ఉన్న సుంకాన్ని రూ.21.80కు పెంచారు. వ్యాట్ తగ్గించమని రాష్ట్రాలను కోరే ముందు ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించి చిత్తశుద్ధి చాటుకుంటే బాగుండేది. ఇదిలా ఉంటే సెంట్రల్ ఎక్సైజ్ ట్యాక్స్ రూపంలో లక్షల కోట్లు ఆదాయం వస్తున్న విషయాన్ని ప్రధాని ప్రజలకు చెప్పడం లేదు. ఎక్సైజ్ సుంకం ద్వారా కేంద్రానికి రూ.26 లక్షల కోట్ల ఆదాయం వచ్చిన విషయాన్ని ప్రధాని ఎక్కడా ప్రస్తావించడంలేదు. జీఎస్టీ వసూళ్లలో రాష్ట్రాల వాటాను సకాలంలో చెల్లించడం లేదు. కేంద్రం ఎక్సైజ్ సుంకాన్ని..ఆ తర్వాత రాష్ట్రాలు వ్యాట్ తగ్గించాలి. అప్పుడే పెట్రో ధరలు తగ్గి రవాణా ఛార్జీలు తగ్గుతాయి. దీంతో సరకు రావాణా భారం కూడా తగ్గుతుంది. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు అధికంగా ఉన్నాయని, అక్కడి ప్రభుత్వాలు విలువ ఆధారిత పన్ను వ్యాట్ తగ్గించకపోవడమే ఇందుకు కారణమని బిజెపి నేతలు నీతులు వల్లిస్తున్నారు. ఓ రకంగా పెట్రో ధరలపై రాష్ట్రాలను అప్రతిష్టపాలు చేయాలన్న ఆలోచన తప్ప నిర్మాణాత్మక ఆలోచన మాత్రం చేయడం లేదు. సామాన్య ప్రజలకు ఊరట కలిగించడానికి, దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని పెట్రో ఉత్పత్తులపై ఎక్సైజ్ డ్యూటీ,వ్యాట్ తగ్గించాల్సిందే. అప్పుడు ప్రభుత్వం కూడా తన వ్యయాన్ని ఆ మేరకు పెంచవలసి వుంటుంది. ఆ విధంగా అదనపు వ్యయం చేయాలంటే అందుకోసం ప్రభుత్వం తన ఆదాయాన్నీ పెంచుకోవాలి, అందుకు ప్రభుత్వం పెట్రో ఉత్పత్తుల మీద తనకు వచ్చే పన్ను ఆదాయాన్ని పెంచు కోవాలి . ప్రభుత్వం మాదిరిగానే పెట్రో ఉత్పత్తులను వినియోగించే ప్రతీ సంస్థా ఆర్‌టిసి, ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలువంటివి కూడా తమ సేవల రేట్లు పెంచవలసి వుంటుంది. ఇదంతా కలిసి ద్రవ్యోల్బణాన్ని పెంచుతాయి. ఇంతటితోనే ఇది ఆగదని, రాబోయే రోజుల్లో ఇదే విధమైన వడ్డింపులు మరిన్ని రానున్నా యని నిపుణులు హెచ్చరిస్తూనే ఉన్నారు. అటు కంపెనీలూ చమురు పెరుగుదల భారాన్ని భరించడానికి సిద్ధంగా లేవు. ఇటు ప్రభుత్వమూ పెరిగే ధరల ద్వారా తనకు లభించే అదనపు ఆదాయాన్ని వదులు కోడానికి సిద్ధంగా లేదు. భారమంతా వినియోగదారులపైనే పడేయడం ద్వారాచేతులు దులుపుకోవాలన్న ధోరణిలో పాలకులు ఉన్నారు.

ఉత్తేజిత దినపత్రిక

# మాల్దీవుల్లో సన్‌రైజర్స్



హైదరాబాద్: సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు సేదతీరడం కోసం మాల్దీవులకు వెళ్లింది. సన్‌రైజర్స్ సోషల్ మీడియా టీమ్ పోస్ట్ చేసిన వీడియోలో ఆటగాళ్లు మాల్దీవుల్లో సరదాగా గడుపుతూ కనిపించారు. శుక్రవారం చెన్నైపై విజయంతో సన్‌రైజర్స్ తన ప్లేఆఫ్స్ ఆశలను నిలబెట్టుకున్న సంగతి తెలిసిందే. ఆ జట్టు తన తర్వాతి మ్యాచ్‌లో మే 2న గుజరాత్‌ను ఢీకొంటుంది. మధ్యలో ఆరు రోజుల విరామం రావడంతో ఆ జట్టు విహారానికి వెళ్లింది.

# ఆర్సీబీ ఖాతాలో ఏడో విజయం


## మెరిసిన కృనాల్
## ఢిల్లీ క్యాపిటల్స్ పరాజయం



ఢిల్లీ : రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మెరిసింది. ఆదివారం స్వల్ప స్కోర్ల మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌పై గెలిచింది. బ్యాటింగ్‌కు అంత తేలికగా లేని పిచ్‌పై మొదట ఢిల్లీ 8 వికెట్లకు 162 పరుగులే చేయగలిగింది. రాహుల్ (41బీ 39 బంతుల్లో 3ఐ4), స్టబ్స్ (34) రాణించారు. భువనేశ్వర్ (3/33), హేజిల్‌వుడ్ (2/36), కృనాల్ (1/28), సుయశ్ (0/22) ఢిల్లీని కట్టడి చేశారు. కృనాల్ పాండ్య (73 నాటౌట్) మెరవడంతో లక్ష్యాన్ని ఆర్సీబీ 18.3 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. కోహ్లి (51బీ 47 బంతుల్లో 4ఐ4) రాణించాడు.

**గెలిపించిన కృనాల్:** మందకొడి పిచ్‌పై ఛేదనలో బెంగళూరు కూడా పరుగుల కోసం చెమటోడ్చింది. కానీ కృనాల్ సమయానికి గేరు మార్చడం ఆ జట్టును విజయతీరాలకు చేర్చింది. ఛేదనలో అక్షర్ ఇన్నింగ్స్ మూడో ఓవర్లోనే బెతెల్, పడిక్కల్‌లను ఔట్ చేయడం ద్వారా బెంగళూరును దెబ్బతీశాడు. రజత్ రనౌట్ కావడంతో ఆర్సీబీ 26/3తో చిక్కుల్లో పడింది. ఆ దశలో కోహ్లికి తోడయ్యాడు కృనాల్. ఇద్దరూ వెంటనే వికెట్ పడనివ్వలేదు. కానీ షాట్లు ఆడడం వారికి కష్టమైపోయింది. సాధించాల్సిన రన్‌రేట్ బాగా పెరిగింది. 10 ఓవర్లకు బెంగళూరు స్కోరు 64 మాత్రమే. ఆ దశలో ఢిల్లీదే పైచేయిగా కనిపించింది. అయితే కోహ్లి సింగిల్స్‌తోనే కొనసాగినా.. జోరు పెంచిన కృనాల్ ధనాధన్ బ్యాటింగ్‌తో మ్యాచ్ గమనాన్ని మార్చాడు. చమీర బౌలింగ్‌లో సిక్స్ బాదిన అతడు.. ముకేశ్ బౌలింగ్‌లో వరుసగా రెండు సిక్స్‌లు దంచేశాడు. కుల్‌దీప్ బౌలింగ్‌లో సిక్స్, అక్షర్ బౌలింగ్‌లో ఫోర్ బాదేశాడు. ముకేశ్ ఓవర్లోనూ అతడు మరో రెండు ఫోర్లు కొట్టడంతో బెంగళూరు సమీకరణం తేలికైపోయింది. 17వ ఓవర్లకు స్కోరు 137/3. ఆఖరి మూడు ఓవర్లలో ఆ జట్టు 26 పరుగులు చేయాల్సిన పరిస్థితి. తర్వాతి ఓవర్లో 9 పరుగులిచ్చిన చమీర.. కోహ్లిని ఔట్ చేయడం ఢిల్లీలో కాస్త ఆశలు రేపాడు. కానీ పేలవ బౌలింగ్‌ను కొనసాగించిన ముకేశ్ ఆ జట్టుకు ఎలాంటి అవకాశం లేకుండా చేశాడు. అతను వేసిన ఇన్నింగ్స్ 19వ ఓవర్లో వరుసగా 6, 4 (నోబాల్), 4, 4 బాదిన డేవిడ్ (19 నాటౌట్).. పని పూర్తి చేశాడు.

**ఢిల్లీ కట్టడి:** అంతకుముందు ఢిల్లీకి పరుగుల కోసం కష్టపడింది. ఆఖర్లో స్టబ్స్ మెరుపులతో పోటీ ఇవ్వదగ్గ లక్ష్యాన్ని నిర్దేశించగలిగింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ.. నిజానికి మొదట్లో బాగానే ఉంది. అభిషేక్ పోరెల్ (28) ధనాధన్ బ్యాటింగ్‌తో మూడు ఓవర్లలో 32/0తో నిలిచింది. భువి బౌలింగ్‌లో పోరెల్ రెండు సిక్స్‌లు బాదేశాడు. అయితే నాలుగో ఓవర్లో అతణ్ని హేజిల్‌వుడ్ ఔట్ చేయడంతో ఇన్నింగ్స్ స్వభావమే మారిపోయింది. తర్వాతి ఓవర్లో కరుణ్ నాయర్‌నూ కోల్పోయి ఢిల్లీ పరుగుల వేటలో బాగా వెనుకబడింది. డుప్లెసిస్ (22బీ 26 బంతుల్లో 2ఐ4), రాహుల్ నిలిచినా.. ధాటిగా ఆడలేకపోయారు. షాట్లు ఆడేందుకు కష్టపడ్డారు. హేజిల్‌వుడ్, సుయశ్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. పదో ఓవర్లో డుప్లెసిస్ ఔటయ్యే సమయానికి ఢిల్లీ స్కోరు 72 పరుగులు మాత్రమే. రాహుల్ ఎదుర్కొన్న తొలి 19 బంతుల్లో 16 పరుగులే చేశాడు. రాహుల్ జోరందుకోకున్నా.. క్రీజులోకి వచ్చిన అక్షర్ పటేల్ (15).. చకచకా ఓ ఫోర్, సిక్స్‌తో స్కోరు వేగాన్ని పెంచేందుకు ప్రయత్నించాడు. కానీ హేజిల్‌వుడ్ అతణ్ని ఎక్కువసేపు నిలువన్వివలేదు. రాహుల్ కూడా గేర్ మార్చకుండానే నిష్క్రమించాడు. 17వ ఓవర్లో కేవలం మూడు పరుగులే ఇచ్చిన భువనేశ్వర్.. అతడితో పాటు అశుతోష్ (2)ను వెనక్కి పంపి ఢిల్లీని దెబ్బతీశాడు. ఆ ఓవర్ ముగిసే సరికి ఆ జట్టు స్కోరు 120 మాత్రమే. కానీ స్టబ్స్ చెలరేగడంతో ఆఖరి మూడు ఓవర్లలో 42 పరుగులు రాబట్టిన ఢిల్లీ.. 160 దాటగలిగింది. స్టబ్స్ విరుచుకుపడడంతో 18వ ఓవర్లో హేజిల్‌వుడ్ 17, 19వ ఓవర్లో యశ్ దయాళ్ 19 పరుగులు సమర్పించుకున్నారు. అయితే భువి ఆఖరి ఓవర్లో 6 పరుగులే ఇచ్చి స్టబ్స్‌ను ఔట్ చేశాడు. విప్రాజ్ రనౌటయ్యాడు.




# ముంబయి వరుసగా ఐదో విజయం

**లఖ్‌నవూపై ఘనవిజయం**

**విజృంభించిన బుమ్రా, బౌల్ట్**

**మెరిసిన సూర్య, రికిల్‌టన్**


బుమ్రా 4/22


ముంబయి: ముంబయి ఇండియన్స్ అదరగొట్టింది. ఫామ్ కొనసాగిస్తూ ఐపీఎల్-18లో మరో విజయాన్ని సొంతం చేసుకుంది. ఆదివారం 54 పరుగుల తేడాతో లఖ్‌నవూను చిత్తు చేసింది. మొదట సూర్యకుమార్ (54), రికిల్‌టన్ (58) మెరుపులతో ముంబయి 7 వికెట్లకు 215 పరుగులు చేసింది. మయాంక్, అవేష్ రెండేసి వికెట్లు తీశారు. ఇంపాక్ట్ ప్లేయర్ బుమ్రా (4/22), బౌల్ట్ (3/20), విల్ జాక్స్ (2/18) విజృంభించడంతో ఛేదనలో లఖ్‌నవూ 20 ఓవర్లలో 161 పరుగులకే ఆలౌటైంది. బదోని (35బీ 22 బంతుల్లో 2ఐ4, 2ఐ6) టాప్ స్కోరర్.

**బదోని, మార్ష్ నిలిచినా..:** భారీ ఛేదనలో లఖ్‌నవూ తడబడింది. ఈ సీజన్లో మిచెల్ మార్ష్‌తో కలిసి తొలి వికెట్‌కు మూడుసార్లు 50 అంతకంటే ఎక్కువ భాగస్వామ్యాలు నెలకొల్పిన మార్‌క్రమ్ (9).. ఈసారి త్వరగా ఔటయ్యాడు. అయితే మార్ష్ (34బీ 24 బంతుల్లో 2ఐ4, 2ఐ6) పూరన్ (27బీ 15 బంతుల్లో 1ఐ4, 3ఐ6) దూకుడుగా ఆడడంతో లఖ్‌నవూ పుంజుకుంది. దీపక్ చాహర్ వేసిన ఆరో ఓవర్లో పూరన్ 3 సిక్స్‌లు బాదడంతో 20 పరుగులొచ్చాయి. స్పిన్నర్ విల్ జాక్స్ మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. ఒకే ఓవర్లో పూరన్, రిషబ్ పంత్ (4)లను ఔట్ చేసి ఎల్ఎస్‌జీని దెబ్బ కొట్టాడు. అక్కడి నుంచి స్కోరు వేగం మందగించింది. కర్ణ్ శర్మ బౌలింగ్‌లో బదోని రెండు సిక్స్‌లు బాది స్కోరు బోర్డును కాస్త కదిలించినా.. సాధించాల్సిన రన్‌రేట్ పెరుగుతూ పోయింది. దీనికి తోడు మార్ష్ కూడా వెనుదిరగడంతో ముంబయి మ్యాచ్‌పై మరింత పట్టు బిగించింది. బదోని, మిల్లర్ (24) కాసేపు నిలిచి లఖ్‌నవూలో ఆశలు రేపారు. ఓవర్ తేడాతో వీళ్లిద్దరూ ఔటైపోవడంతో ఆ జట్టు పనైపోయింది. బదోనిని బౌల్ట్ పెవిలియన్ చేర్చగా.. 16వ ఓవర్లో పేసర్ బుమ్రా అదరగొట్టాడు. అతడు 2 పరుగులే ఇచ్చి మిల్లర్, సమద్ (2), అవేశ్ (0) వికెట్లను ఖాతాలో వేసుకుని లఖ్‌నవూ పతనాన్ని మరింత వేగవంతం చేశాడు. ఆ తర్వాత ఎల్ఎస్‌జీ ఇన్నింగ్స్ ఎక్కువసేపు సాగలేదు. ఇన్నింగ్స్ చివరి బంతికి దిగ్వేశ్ (1)ను బౌల్ట్ బౌల్డ్ చేయడంతో ఎల్ఎస్‌జీ ఆలౌటైంది.


సూర్యకుమార్ 54

**రికిల్‌టన్, సూర్య ధనాధన్:** అంతకుముందు ముంబయి ఇన్నింగ్స్‌లో రికిల్‌టన్, సూర్యకుమార్ అదరగొట్టారు. దూకుడుగా ఆడి జట్టు భారీ స్కోరు చేయడంలో కీలకపాత్ర పోషించారు. ముంబయి ఆరంభంలోనే తడబడినా.. మొదట రికిల్‌టన్, తర్వాత సూర్య ఇన్నింగ్స్‌ను నిలబెట్టారు. ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చి గత రెండు మ్యాచ్‌ల్లో అర్ధసెంచరీలతో మెరిసిన రోహిత్‌శర్మ (12) ఈసారి విఫలమయ్యాడు. పునరాగమన పేసర్ మయాంక్ యాదవ్ బౌలింగ్‌లో వరుసగా రెండు భారీ సిక్స్‌లు బాదిన రోహిత్.. అదే ఓవర్లో ఔటైపోయాడు. వికెట్ పడినా.. రికిల్‌టన్ సిక్స్‌ల వేటలో సాగడంతో స్కోరు బోర్డు పరుగులెత్తింది. అర్ధసెంచరీ చేసిన రికిల్‌టన్‌ను స్పిన్నర్ దిగ్వేశ్ ఔట్ చేసి లఖ్‌నవూకు బ్రేక్ ఇచ్చాడు. రికిల్‌టన్‌తో పాటు జాక్స్ (29) పెవిలియన్ చేరినా.. సూర్యకుమార్ తగ్గలేదు. తన ట్రేడ్‌మార్క్ స్లాగ్ స్వీప్, పుల్ షాట్లతో స్కోరు పెంచాడు. బిష్ణోయ్ వేసిన 13వ ఓవర్లో అతడు వరుసగా 4, 4, 6 బాదేశాడు. ఒకవైపు సూర్య బాదుతున్నా.. మరోవైపు వికెట్ల పతనం ఆగలేదు. తిలక్‌వర్మ (6), హార్దిక్ పాండ్య (5) స్వల్ప స్కోర్లకే వెనుదిరిగారు. అయినా దూకుడు కొనసాగించిన సూర్య.. 27 బంతుల్లోనే అర్ధసెంచరీ చేశాడు. అవేష్ బౌలింగ్‌లో ఓ సిక్స్‌తో 50 చేరుకున్న అతడు.. అదే ఓవర్లో పెవిలియన్ చేరాడు. చివర్లో నమన్ ధీర్ (25 నాటౌట్), కార్బిన్ బోష్ (20), ధాటిగా ఆడి స్కోరు 200 దాటించారు. ఆఖరి 4 ఓవర్లలో ముంబయి 53 పరుగులు రాబట్టింది.

# మయాంక్ వచ్చాడు




2024 ఐపీఎల్ సీజన్లో నిలకడగా 150 కి.మీ వేగంతో బౌలింగ్ చేసి అందరి దృష్టిని ఆకర్షించాడు లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ ఫాస్ట్ బౌలర్ మయాంక్ యాదవ్. ఈ ప్రదర్శనతో అతడు భారత జట్టులో చోటు కూడా దక్కించుకున్నాడు. కానీ గాయంతో ఆరు నెలలుగా ఈ పేసర్ ఆటకు దూరమైపోయాడు. ఐపీఎల్-18లో అతడు లఖ్‌నవూ జట్టులో ఉన్నా.. మ్యాచ్ ఫిట్‌నెస్ లేకపోవడంతో ఎల్ఎస్‌జీ ఇప్పటిదాకా ఆడిన మ్యాచ్‌లకు దూరమయ్యాడు. ఆదివారం ముంబయితో మ్యాచ్‌లో మయాంక్ పునరాగమనం చేశాడు. కానీ మునుపటిలా మెరుపు వేగంతో బంతులు వేయలేకపోయాడు. ఈ మ్యాచ్‌లో అతడు వేసిన వేగవంతమైన బంతి 142.7 కి.మీ మాత్రమే. అయినా రోహిత్‌శర్మ, హార్దిక్ పాండ్య వికెట్లను చేజిక్కించుకుని సత్తా చాటాడు.

# శ్రీలంకపై భారత్ విజయం



కొలంబో: ముక్కోణపు వన్డే సిరీస్‌లో భారత మహిళల జట్టు శుభారంభం చేసింది. ఓపెనర్ ప్రతీక రావల్‌తో పాటు స్పిన్నర్లు రాణించడంతో ఆదివారం వర్ష ప్రభావిత తొలి మ్యాచ్‌లో భారత్ 9 వికెట్ల తేడాతో శ్రీలంకపై ఘనవిజయం సాధించింది. వర్షం కారణంగా ఇన్నింగ్స్‌ను 39 ఓవర్లకు కుదించారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక.. స్నేహ్ రాణా (3/31), శ్రీ చరణి (2/26), దీప్తి శర్మ (2/22)ల ధాటికి 38.1 ఓవర్లలో 147 పరుగులకే ఆలౌటైంది. క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయిన లంక.. పరుగుల కోసం చెమటోడ్చింది. హాసిని పెరీరా (30బీ 46 బంతుల్లో 4ఐ4) టాప్ స్కోరర్. కవిషా 25 పరుగులు చేసింది. ప్రతీక రావల్ (50 నాటౌట్‌బీ 62 బంతుల్లో 7ఐ4) మెరవడంతో లక్ష్యాన్ని భారత్ 29.4 ఓవర్లలో ఒక వికెట్ మాత్రమే కోల్పోయి అలవోకగా ఛేదించింది. స్మృతి మంధాన (43బీ 46 బంతుల్లో 6ఐ4), హర్లీన్ డియోల్ (48 నాటౌట్‌బీ 71 బంతుల్లో 4ఐ4) కూడా సత్తా చాటారు. ఛేదనలో భారత్‌పై లంక బౌలర్లు ఏమాత్రం ప్రభావం చూపలేకపోయారు. కెరీర్‌లో ఏడో వన్డే ఆడిన ప్రతీక.. సాధికారికంగా బ్యాటింగ్ చేసింది. స్మృతితో తొలి వికెట్‌కు 54, హర్లీన్‌తో అభేద్యమైన రెండో వికెట్‌కు 95 పరుగులు జోడించి జట్టును విజయపథంలో నడిపించింది. భారత్ తన తర్వాతి మ్యాచ్‌లో మంగళవారం దక్షిణాఫ్రికాను ఢీకొంటుంది.



స్నేహ్ రాణా

# ఎరుపెక్కుతున్న 'కర్రెగుట్టలు'..

## 38 మందికి పైగా మావోయిస్టులు మృతి..!

**తెలంగాణ:** తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని కర్రెగుట్ట ప్రాంతంలో భద్రతా బలగాలు మావోయిస్టుల నిర్మూలన కోసం భారీ ఆపరేషన్ చేపట్టాయి. నాలుగు రోజులుగా కొనసాగుతున్న కూంబింగ్‌లో ఇప్పటికే 38 మంది మావోయిస్టులు మృతి చెందినట్లు సమాచారం. హెలీకాప్టర్లు, డ్రోన్ల సహాయంతో భద్రతా దళాలు దాడులు చేస్తున్నారు. కర్రెగుట్టను మూడువైపులా ముట్టడి చేసి మావోయిస్టులకు పారిపోవడానికి మార్గం లేకుండా చేశారు. 10 వేల మంది భద్రతా సిబ్బంది ఆపరేషన్‌లో పాల్గొన్నారు.

తెలంగాణ- ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో ఉన్న కర్రెగుట్ట ప్రాంతంలో మావోయిస్టుల నిర్మూలన లక్ష్యంగా భద్రతా బలగాలు రహస్యంగా ఆపరేషన్ కొనసాగిస్తున్నాయి. గత నాలుగు రోజులుగా కూంబింగ్ కార్యకలాపాలు కొనసాగుతుండగా.. ఆపరేషన్ వివరాలను ఛత్తీస్‌గఢ్, తెలంగాణ పోలీసులు గోప్యంగా ఉంచుతున్నారు. భద్రతా బలగాలు చేపట్టిన ఆపరేషన్‌లో భారీ ఎన్‌కౌంటర్ జరిగినట్లు తెలిసింది. ఇప్పటి వరకు లభించిన



సమాచారం ప్రకారం.. దాదాపు 38 మంది మావోయిస్టులు మృతి చెందారు. భద్రతా బలగాలు అధునాతన ఆయుధాలు, సాటిలైట్‌లు, డ్రోన్ల సహాయంతో ఆపరేషన్‌ను కొనసాగిస్తున్నాయి. హెలీకాప్టర్లతో గగనతలంలో నుంచి మావోయిస్టుల మీద బాంబుల వర్షం కురిపిస్తున్నారు.

కర్రెగుట్ట ప్రాంతాన్ని మూడువైపులా చుట్టుముట్టిన భద్రతా దళాలు మావోయిస్టులకు తప్పించుకునే మార్గం లేకుండా చేశాయి. ఈ ఆపరేషన్‌లో దాదాపు 10 వేల మంది భద్రతా సిబ్బంది మోహరించగా.. అడవి ప్రాంతాల్లో కూంబింగ్ కొనసాగుతోంది. మావోయిస్టుల నుంచి బలమైన ప్రతిఘటన ఎదురైనప్పటికీ భద్రత దళాలు సమర్థవంతంగా ముందుకు సాగుతున్నాయి. కాల్పులు, బాంబుల ధ్వని కారణంగా సరిహద్దు గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. భద్రతా బలగాల భారీ దాడితో మావోయిస్టు శిబిరాలు ధ్వంసమైనట్లు తెలిసింది. కాల్పుల్లో మృతి చెందిన మావోయిస్టుల వివరాలు అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. ప్రాథమిక సమాచారం ప్రకారం మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముంది.

కాగా, తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా సరిహద్దుల్లో కర్రెగుట్టల అటవీ ప్రాంతం ఉంటుంది. గత కొన్ని వారాలుగా కర్రెగుట్టల ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నట్లు నిఘా వర్గాల నుంచి సమాచారం అందింది. అంతేకాకుండా, వారు కొత్తగా రిక్రూట్‌మెంట్లు చేస్తున్నట్లు, విధ్వంసక చర్యలకు పాల్పడేందుకు ప్రణాళికలు వేస్తున్నట్లు కూడా సమాచారం ఉంది. ఈ నేపథ్యంలో భద్రతా బలగాలు సంయుక్తంగా ఈ కూంబింగ్‌ను నిర్వహిస్తున్నాయి.

తెలంగాణ పోలీసుల ప్రత్యేక బలగాలు (గ్రేహౌండ్స్), కేంద్ర రిజర్వ్ పోలీస్ ఫోర్స్ , ఛత్తీస్‌గఢ్ డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్, రెండు రాష్ట్రాల పోలీసులు సమన్వయంతో ఈ ఆపరేషన్ కొనసాగిస్తున్నారు. భద్రతా బలగాలు కర్రెగుట్టల అటవీ ప్రాంతంలోకి పలు బృందాలుగా చొచ్చుకెళ్లాయి. అడుగడుగునా క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మావోయిస్టులకు సంబంధించిన ఆయుధాలు, మందుగుండు సామగ్రి, ఇతర సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌కౌంటర్‌లో దాదాపు 38 మంది మరణించగా.. అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

# వ్యంగ్యంగా వెల్‌కమ్ చెప్పిన ఎమ్మెల్సీ కవిత

**హైదరాబాద్:** ఏఐసీసీ నేత రాహుల్ గాంధీ హైదరాబాద్ పర్యటనపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత తీవ్రంగా స్పందించారు. ఎక్స్ వేదికగా రాహుల్‌పై విమర్శలు గుప్పించారు. దారి తప్పి ఎన్నికల గాంధీ నగరానికి వస్తున్నారని ఎద్దేవా చేశారు. మోసపూరిత హామీలు, అబద్ధపు వాగ్దానాలతో తెలంగాణ ప్రజలను మోసగించారని ఆరోపించారు. హైదరాబాద్ పర్యటనలో లాఠీ దెబ్బలు తిన్న సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులను పరామర్శించాలని డిమాండ్ చేశారు.

భారత్ సమ్మిట్ 2025 కార్యక్రమం హైదరాబాద్‌లో జరుగుతోన్న సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమంలో ప్రపంచ వ్యాప్తంగా 100 దేశాలకు చెందిన 450 మందికి పైగా ప్రతినిధులు, 40 నుంచి 50 మంది మంత్రులు, 50 మంది పార్లమెంటు సభ్యులు, 100 మంది రాజకీయ పార్టీ ప్రతినిధులు పాల్గొంటున్నారు. నేడు సదస్సు ఆఖరి రోజు కాగా.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సదస్సులో పాల్గొనేందుకు నగరానికి వచ్చారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఆయనకు వ్యంగంగా వెల్‌కమ్ చెప్పింది. దారి తప్పి తెలంగాణకు వస్తున్న ఎన్నికల గాంధీకి స్వాగతం అంటూ ఆమె ఎద్దేవా చేశారు. మోసపూరిత హామీలు, అబద్ధపు వాగ్దానాలతో తెలంగాణ ప్రజలను



రాహుల్ మోసగించారంటూ ట్విట్టర్ ఎక్స్ వేదికగా విమర్శలు గుప్పించారు.

దారితప్పి తెలంగాణకు వస్తున్న ఎన్నికల గాంధీ గారికి స్వాగతం. మోసపూరిత హామీలు.. అబద్ధపు వాగ్దానాలతో తెలంగాణ ప్రజలను నిండా ముంచేసి హైదరాబాద్ నగరానికి వస్తున్న రాహుల్ గాంధీ గారికి సుస్వాగతం. మీ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ 16 నెలల పాలనలో ప్రజలను రాచిరంపాన పెట్టింది. హైడ్రా, మూసీ పేరుతో పేద ప్రజల మీదికి బుల్డోజర్లు పంపింది. లగచర్ల బంజారా ఆడబిడ్డలపై అర్ధరాత్రి వేళ అఘాయిత్యాలకు ఒడిగట్టింది. సర్కారు దుశ్చర్యకు అడ్డంకిగా ఉన్నారని బంజారా యువతపై థర్డ్ డిగ్రీ ప్రయోగించింది. రేవంత్ రెడ్డి గారి ప్రభుత్వం సాగించిన ఈ రాక్షసకాండను జాతీయ మానవ హక్కుల కమిషన్ నిర్ధారించింది.

కరెంట్ పోయిందని సోషల్ మీడియాలో పోస్ట్ పెడితే అరెస్టులు.. వేధింపులు.. బెదిరింపులు. పచ్చని అడవిని సర్వనాశనం చేస్తున్నారని సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు నిరసనకు దిగితే వారిపై లాఠీల మోతలు.. అక్రమ కేసులు.. అరెస్టులు. ఈ హైదరాబాద్ పర్యటనలో మీరు హెచ్‌సీయూను సందర్శించి లాఠీ దెబ్బలు తిన్న, వేధింపులకు గురైన విద్యార్థులను పరామర్శించండి. తెలంగాణ ప్రజలు శ్రీమతి సోనియాగాంధీ గారిని, మీ సోదరి శ్రీమతి ప్రియాంకా గాంధీ గారిని.. మిమ్మల్ని నమ్మి అధికారమిస్తే ఉమ్మడి రాష్ట్రంలో కన్నా తీవ్ర నిర్బంధం, అణచివేతను బహుమతిగా ఇచ్చారు.

బిహార్‌లో విద్యార్థుల గోడు వినాలని వారి పక్షాన గళమెత్తిన మీరు.. తెలంగాణలో గ్రూప్ -1 అభ్యర్థుల ఆందోళనలపై ఎందుకు మౌనంగా ఉన్నారు? మీరు, గౌరవ శ్రీమతి సోనియా గాంధీ గారు ఇచ్చిన ఆరు గ్యారంటీల పరిస్థితి ఏమిటి ? డిసెంబర్ 9 , 2023 న రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ఇచ్చిన హామీని సగానికే పరిమితం చేశారు. దేశానికి ఆదర్శంగా నిలిచిన రైతుబంధు పథకానికి తూట్లు పొడిచి ఆ పథకాన్ని నిర్వీర్యం చేశారు.. అయినా మీ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని నిలదీయరెందుకు? కళ్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం ఏమైంది? మహిళలకు నెలకు రూ.2500 ఏమయ్యాయి? 18 ఏళ్లు నిండిన ఆడపిల్లలకు స్కూటీలు ఎప్పుడు ఇస్తారు.. ఆరు గ్యారంటీలు, 420 హామీలను ఎప్పుడు అమలు చేస్తారు? ఎర్ర బుక్కు పట్టుకుని రాజ్యాంగాన్ని రక్షించాలంటూ దేశమంతా తిరిగే మీరు తెలంగాణలో మీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మానవ హక్కులను మంటకలుపుతూ.. దమనకాండ కొనసాగిస్తూ.. ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేస్తుంటే ఎందుకు మౌనంగా ఉన్నారు.. మీ మౌనం దేనికి సంకేతం?' అని కవిత ప్రశ్నించారు.

# కుంట్లూరులో భారీ అగ్నిప్రమాదం.. 30 గుడిసెలు దగ్ధం, రోడ్డున పడ్డ పేదలు



**హైదరాబాద్:** హైదరాబాద్ నగర శివారు హయత్‌నగర్ పరిధిలోని కుంట్లూరులో శనివారం (ఏప్రిల్ 26న) రోజు మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. రావి నారాయణరెడ్డి కాలనీ సమీపంలో ఉన్న పేదలు నివసిస్తున్న గుడిసెల్లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. బలమైన గాలుల కారణంగా మంటలు వేగంగా వ్యాపించడంతో క్షణాల్లోనే 30కి పైగా గుడిసెలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో కొన్ని గుడిసెల్లో ఉన్న గ్యాస్ సిలిండర్లు పేలడంతో మంటలు మరింత తీవ్రంగా ఎగిసిపడ్డాయి. పేలుళ్ల శబ్దాలు విని స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఏం జరుగుతుందో అర్థంకాక ప్రజలు భయంతో పరుగులు తీశారు.

సమాచారం అందుకున్న హయత్‌నగర్ అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే.. గుడిసెలు ఒకదానికొకటి ఆనుకుని ఉండటంతో మంటలను పూర్తిగా నియంత్రించడానికి సమయం పట్టే అవకాశం ఉంది. భారీగా ఎగిసిపడుతున్న మంటలను చూసి స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

అగ్నిప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. షార్ట్ సర్క్యూట్ లేదా ఇతర కారణాల వల్ల ప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అగ్నిప్రమాదానికి గల కారణాలు ఏమిటనేది విచారణ అనంతరం తెలుస్తుంది. ప్రమాదం జరిగిన తీరుపై పోలీసులు స్థానికులను ఆరా తీస్తున్నారు.

ఈ దుర్ఘటనలో ఆస్తి నష్టం భారీగా ఉంటుందని తెలుస్తోంది. చాలా మంది పేద ప్రజలు నిరాశ్రయులయ్యారు. ఈ ప్రమాదం కారణంగా నిరాశ్రయులైన వారికి సహాయం అందించేందుకు స్థానిక అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వారికి తాత్కాలిక ఆశ్రయం మరియు ఆహారం ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వేసవిలో అగ్నిప్రమాదాలు జరగకుండా ఉండాలంటే కొన్ని ముఖ్యమైన జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరం. అధిక ఉష్ణోగ్రతలు, పొడి వాతావరణం కారణంగా మంటలు త్వరగా వ్యాపించే అవకాశం ఉంటుంది. కాబట్టి, మనం మరింత అప్రమత్తంగా ఉండాలి.

**ఇంట్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు..**

ఇంట్లోని వైరింగ్, స్విచ్‌లు, సాకెట్లు, ఇతర విద్యుత్ పరికరాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలి. ఎక్కడైనా లూజు కనెక్షన్లు లేదా పాత వైరింగ్ ఉంటే వెంటనే వాటిని సరిచేయించాలి లేదా మార్చాలి. ఐఎస్ఐ మార్క్ ఉన్న నాణ్యమైన విద్యుత్ పరికరాలను మాత్రమే ఉపయోగించాలి. తక్కువ నాణ్యత గల పరికరాలు వేడెక్కి ప్రమాదానికి దారితీయవచ్చు. ఒకే సాకెట్‌పై ఎక్కువ పరికరాలను ఉపయోగించడం (ఓవర్‌లోడింగ్) వల్ల షార్ట్ సర్క్యూట్ వచ్చే ప్రమాదం ఉంది. దీనిని నివారించాలి.

గ్యాస్ సిలిండర్‌ను ఎల్లప్పుడూ నిటారుగా ఉంచాలి. రెగ్యులేటర్ మరియు పైపులను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలి. గ్యాస్ లీక్ అవుతున్నట్లు అనుమానం వస్తే వెంటనే మెయిన్ స్విచ్ ఆఫ్ చేసి, తలుపులు మరియు కిటికీలు తెరిచి వెంటిలేషన్ ఉండేలా చూడాలి మరియు నిపుణుడిని సంప్రదించాలి. కిరోసిన్, పెట్రోల్, వంటనూనె వంటి త్వరగా మంటుకునే పదార్థాలను వేడి ప్రదేశాలకు లేదా నేరుగా సూర్యరశ్మి తగిలే చోట ఉంచకూడదు. వాటిని పిల్లలకు దూరంగా భద్రపరచాలి. ఇంట్లో లేదా పొడి గడ్డి ఉన్న ప్రదేశాల్లో పొగ త్రాగడం, అగ్గిపుల్లలు, సిగరెట్ బట్లను అజాగ్రత్తగా పడేయడం ప్రమాదకరం. వీలైతే ఇంట్లో చిన్నపాటి అగ్నిమాపక పరికరం మరియు ఇసుక లేదా నీటిని అందుబాటులో ఉంచుకోవడం మంచిది. వాటిని ఎలా ఉపయోగించాలో కూడా తెలుసుకోవాలి.

**బయట తీసుకోవాల్సిన జాగ్రత్తలు..**

పొడి గడ్డి, ఆకులు, ఇతర మండే పదార్థాలు పేరుకుపోకుండా మీ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోండి.

పిల్లలు ఆడుకునేటప్పుడు అగ్గిపుల్లలు లేదా లైటర్లతో ఆడుకోకుండా జాగ్రత్త వహించాలి. వెల్డింగ్ లేదా మంటలు పుట్టే ఇతర పనులు చేసేటప్పుడు చుట్టూ నీరు లేదా ఇసుక ఉంచాలి మరియు జాగ్రత్తలు తీసుకోవాలి. వేసవిలో అటవీ ప్రాంతాలకు వెళ్లినప్పుడు నిప్పు పెట్టడం లేదా మంటలు వేయడం చట్టరీత్యా నేరం, ప్రమాదకరం కూడా. వాహనాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలి. ఇంజిన్ బాగా వేడెక్కకుండా చూసుకోవాలి. వాహనంలో మండే పదార్థాలను సురక్షితంగా ఉంచాలి.

# మరో మహిళతో ఏకాంతంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగి..

**హైదరాబాద్:** హైదరాబాద్‌లో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మరో మహిళతో అక్రమ సంబంధం పెట్టుకుని భార్య, కూతుర్ని వదిలేశాడు. కూకట్‌పల్లిలో రెండో ఇల్లు తెరిచి సహజీవనం చేస్తున్నాడు. విషయం తెలుసుకున్న భార్య బంధువులతో కలిసి అతన్ని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది. వారిద్దరూ ఏకాంతంగా ఉండగా పట్టుకుని పోలీసులకు ఫిర్యాదు చేసింది.

హైదరాబాద్‌లో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మరో మహిళతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. భార్య, కూతుర్ని వదిలేసి మరో మహిళతో రెండో ఇంటిని ఓపెన్ చేశాడు. దీంతో రంగంలోకి దిగన భార్య.. భర్త బండారాన్ని బట్టబయలు చేసింది. సదరు మహిళతో ఏకాంతంగా ఉండగా.. రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నగరానికి చెందిన శివ అనే వ్యక్తి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. నాలుగు సంవత్సరాల క్రితం పెద్దల సమక్షంలో దీప్తి అనే అమ్మాయిని వివాహం చేసుకున్నాడు. శివ, దీప్తి దంపతులకు మూడేళ్ల కుమార్తె కూడా ఉంది. అయితే ఇటీవల శివ తన భార్య దీప్తికి దూరంగా ఉంటూ సరైన కారణం చెప్పకుండా ఇల్లు వదిలి వెళ్లిపోయాడు. అనంతరం సుష్మ అనే మహిళతో శివ అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. కూకట్‌పల్లిలో ఓ గదిని అద్దెకు తీసుకొని సహజీవనం చేస్తున్నాడు. విషయం తెలుసుకున్న దీప్తి.. తన బంధువులతో కలిసి శివను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకునేందుకు స్కెచ్ వేసింది. పక్కా సమాచారం మేరకు శివ సుష్మను ఒకే బెడ్‌రూమ్‌లో ఉండగా పట్టుకుంది. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. తనకు అన్యాయం చేసి శివను శిక్షించి న్యాయం చేయాలని డిమాండ్ చేసింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

కాగా, ప్రస్తుత సమాజంలో అక్రమ సంబంధాలు ఆందోళనకరమైన అంశంగా మారాయి. అక్రమ సంబంధాల కారణంగా ఎన్నో కుటుంబాలు ఛిద్రమవుతున్నాయి. భార్యాభర్తల మధ్య నమ్మకం సన్నగిల్లి, అనుమానాలు పెరిగి కాపురాలు కూలిపోతున్నాయి. పిల్లలు తల్లిదండ్రుల ప్రేమకు దూరమై మానసిక క్షోభ అనుభవిస్తున్నారు. ఇది వారి భవిష్యత్తుపై తీవ్రమైన ప్రభావం చూపుతోంది. కుటుంబ వ్యవస్థను కాపాడుకోవడం, ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించడం కోసం అక్రమ సంబంధాలను నిరోధించడం అందరి బాధ్యత. ఈ విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా ప్రవర్తించాల్సిన అవసరం ఉంది.

# హైదరాబాద్‌లో హై అలర్ట్..

## నలుగురు పాకిస్థానీయులకు నోటీసులు..

**హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యలు భద్రతను మరింత పటిష్టం చేసే దిశగా ఉన్నాయని భావించవచ్చు. హైదరాబాద్ నగరంలో నివసిస్తున్న నలుగురు పాకిస్థానీయులకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. షార్ట్ టర్మ్ వీసా, ఎస్టీవీ (స్టే వీసా) కలిగి ఉన్న ఈ నలుగురు వ్యక్తులు రేపటిలోగా హైదరాబాద్ నగరాన్ని విడిచి వెళ్లాలని పోలీసులు ఆదేశించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో మొత్తం 213 మంది పాకిస్థాన్ జాతీయులు నివసిస్తున్నారు. వీరిలో నలుగురు స్వల్పకాలిక వీసాలపై, స్టే వీసాలపై ఇక్కడ ఉంటున్నట్లు గుర్తించారు. పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో భద్రతా కారణాల దృష్ట్యా ముందు జాగ్రత్త చర్యగా నలుగురికి తక్షణమే నగరం విడిచి వెళ్లాలని పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఇక మిగిలిన వారికి లాంగ్ టర్మ్ వీసాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ చర్య కేవలం హైదరాబాద్‌కే పరిమితం కాకుండా.. దేశంలోని ఇతర నగరాల్లో కూడా ఇలాంటి తనిఖీలు, నోటీసులు జారీ చేసే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే దేశంలోని పాకిస్థానీయులందరూ తిరిగి వాళ్ల దేశానికి వెళ్లాలని హెచ్చరికలు జారీ చేసింది. అయితే.. వీసా నిబంధనలు , ఇతర కారణాల వల్ల కొంత సమయం పట్టే అవకాశం ఉంది. జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన దారుణమైన ఉగ్రదాడి దేశవ్యాప్తంగా తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. ఆ దాడిలో అమాయక పర్యాటకులు ప్రాణాలు కోల్పోవడం యావత్ దేశాన్ని శోకసంద్రంలో ముంచింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా భద్రతా చర్యలను కట్టుదిట్టం చేసింది. ఈ దాడిలో పాకిస్తాన్ హస్తం ఉందన్న అనుమానాలు బలపడుతుండటంతో.. దేశ రాజకీయాల్లో వేడి రాజుకుంది. ఈ నేపథ్యంలో.. కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకున్నా తాము మద్దతుగా ఉంటామని అన్ని రాజకీయ పార్టీలు ముక్తకంఠంతో ప్రకటిస్తున్నాయి. ఈ విషయంలో రాజకీయ భేదాలు పక్కనపెట్టి దేశ భద్రతకు ప్రాధాన్యమివ్వాలని నేతలు పిలుపునిస్తున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఈ అంశంపై స్పందించారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా భారత్ కఠినంగా వ్యవహరించాలని ఆయన అభిప్రాయపడ్డారు. పాకిస్తాన్ విషయంలో కేంద్రం తీసుకునే ఏ చర్యకైనా తమ పార్టీ సంపూర్ణ మద్దతునిస్తుందని ఆయన స్పష్టం చేశారు. దేశ భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని ఆయన తేల్చి చెప్పారు. కేంద్ర సహాయ మంత్రి, బీజేపీ ఎంపీ బండి సంజయ్ కూడా పాకిస్తాన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భారత్ తీసుకునే చర్యలు పాకిస్తాన్ వెన్నులో వణుకు పుట్టించేలా ఉండాలని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. 'తుపాకీ పట్టినోడు చివరకు ఆ తుపాకీకే బలికాక తప్పదు' అని ఆయన హెచ్చరించారు. ఉగ్రవాదాన్ని అంతమొందించడానికి మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందని.. ఈ దిశగా తీసుకునే చర్యలు పాకిస్థాన్‌కు గట్టి గుణపాఠం నేర్పుతాయని ఆయన అన్నారు.

ఈ ఉగ్రదాడి నేపథ్యంలో.. దేశంలోని భద్రతా దళాలు అప్రమత్తమయ్యాయి. సరిహద్దుల్లో నిఘా పెంచారు. దేశంలోని ప్రధాన నగరాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. అనుమానిత వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని.. అనుమానాస్పద వస్తువులు లేదా వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ దాడిని దేశ ప్రజలు తీవ్రంగా ఖండిస్తున్నారు. అమాయకుల ప్రాణాలు తీసే ఉగ్రవాదులకు తగిన గుణపాఠం చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

# ఆన్‌లైన్‌లో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్

**తెలంగాణ:** తెలంగాణలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లలో దళారుల మోసాలను అరికట్టేందుకు విద్యుత్ శాఖ ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టింది. మీ-సేవ ద్వారా దరఖాస్తు చేసుకున్న రైతులు టీజీఎన్‌పీడీసీఎల్ యాప్‌లో తమ దరఖాస్తు స్థితి, సామగ్రి వివరాలు తెలుసుకోవచ్చు. సరఫరా ఆలస్యమైతే 1912కు ఫిర్యాదు చేయవచ్చు. ఈ కొత్త విధానంతో కనెక్షన్ల మంజూరు వేగంగా, పారదర్శకంగా జరుగుతోంది. రాష్ట్రంలోని రైతులను కొందరు దళారులు మోసం చేస్తున్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ ఇప్పించడానికి రైతుల వద్ద నుంచి ప్రభుత్వం నిర్ణయించిన రుసుము కంటే ఎక్కువ డబ్బు వసూలు చేస్తున్నారు. మధ్యవర్తుల కారణంగా కనెక్షన్ ప్రక్రియ ఆలస్యం కావటంతో పాటుగా.. సరైన పత్రాలు ఉన్నప్పటికీ దళారుల స్వార్థం కోసం ప్రక్రియను సాగదీస్తున్నారు. విద్యుత్ శాఖలోని కొంతమంది సిబ్బందితో కలిసి దళారులు అవినీతికి పాల్పడుతున్నారు. చాలా మంది రైతులకు విద్యుత్ కనెక్షన్ కోసం సరైన విధానం, ఎవరిని సంప్రదించాలో తెలియక దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో రైతులకు మేలు చేకూర్చేలా విద్యుత్తుశాఖ మరింత మెరుగైన సేవలు అందించేందుకు కొత్త సాంకేతికతను అందిపుచ్చుకుంటోంది. తాజాగా వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్ల మంజూరులో వేగం పెంచింది. దళారుల ప్రమేయం లేకుండా.. దరఖాస్తుదారులు స్వయంగా తమ దరఖాస్తుల స్థితిని తెలుసుకునేందుకు ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఇందుకోసం ఎన్‌పీడీసీఎల్ యాప్‌ను తీసుకొచ్చింది.

**అప్లయ్ చేసుకునే విధానం ఇదే..** వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్ కోసం రైతులు మీ-సేవ కేంద్రం ద్వారా దరఖాస్తు చేయాలి. వెంటనే వారి ఫోన్‌కు సమాచారం వస్తుంది. ఫోన్‌కు వచ్చిన నంబర్‌ను యాప్‌లో నమోదు చేస్తే కనెక్షన్ వివరాలు కనిపిస్తాయి. కనెక్షన్ మంజూరైన తర్వాత, అవసరమైన విద్యుత్తు స్తంభాలు, నియంత్రికలు, ఇతర సామగ్రి వివరాలు యాప్‌లో చూపబడతాయి. ప్రభుత్వం కనెక్షన్‌కు రూ.75,000 రాయితీ ఇస్తుంది. అదనపు ఖర్చులు దరఖాస్తుదారుడే 30 రోజుల్లో చెల్లించాలి. సరఫరా వివరాలను యాప్ ద్వారా సులభంగా ట్రాక్ చేయవచ్చు. ఈ సేవ తగినంత వేగంగా లభించకపోతే 1912 నంబరుకు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. ఇప్పుడు రైతులకు వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్ల మంజూరు ప్రక్రియ వేగంగా, పారదర్శకంగా కొనసాగుతోంది. గతంలో కనెక్షన్ కోసం రైతులు ఏళ్ల తరబడి వేచి ఉండాల్సి వచ్చేది. గడిచిన రెండు సంవత్సరాలుగా ఈ ప్రక్రియలో వేగం పెరిగింది. అంతకుముందు అధికారులు మాత్రమే సాంకేతికతను వినియోగించి, ఈ-స్టోర్ విధానం ద్వారా స్టోర్‌లోని సామగ్రిని విత్‌డ్రా చేసేవారు. ఇప్పుడు దరఖాస్తుదారులు కూడా తమ దరఖాస్తు స్థితి, ఎంపిక చేసిన సామగ్రి వివరాలు తెలుసుకోవచ్చు.

# రాత్రికి రాత్రే బీఆర్ఎస్ ఫ్లెక్సీలు తొలగించిన జీహెచ్ఎంసీ..

## అంతు చూస్తానంటూ ఎమ్మెల్యే వార్నింగ్..

**హైదరాబాద్:** బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకల సందర్భంగా హైదరాబాద్ పరిసర ప్రాంతాలలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు వివాదాస్పదమయ్యాయి. కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ ప్రాంతాలలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రజతోత్సవ ఫ్లెక్సీలను హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (హైడ్రా) అధికారులు రాత్రికి రాత్రే తొలగించారు. పోస్టర్లను చించివేశారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పట్టణంలో కూడా బీఆర్ఎస్ ఫ్లెక్సీలను డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్ఎఫ్) సిబ్బంది తొలగించడంతో బీఆర్ఎస్ కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హైడ్రా అధికారుల చర్యలకు నిరసనగా ధర్నా నిర్వహించారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హైడ్రా అధికారుల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. రాత్రికి రాత్రే బీఆర్ఎస్ ఫ్లెక్సీలను తొలగించడం దుర్మార్గమని ఆయన విమర్శించారు.

# చెల్లి చెల్లి అని పిలుస్తూనే.. ఇలా..

**సిరిసిల్ల:** జిల్లాలో దారుణ ఘటన చోటుచేసుకుంది. పక్కింట్లో ఉండే శ్రీకాంత్ అనే వ్యక్తి, ఒంటరిగా ఉన్న రేఖ అనే వివాహితపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. బాధితురాలు ప్రతిఘటించడంతో ఆమెను కొడవలితో నరికి చంపి, తను కూడా ఆత్మహత్య చేసుకున్నాడు. చెల్లి అని పిలుస్తూనే ఇంతటి ఘాతుకానికి పాల్పడటంతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. మరో ఘటనలో.. కరీంనగర్‌లోని జ్యోతినగర్‌లో అద్దెకు ఉంటున్న ఝాన్సీ అనే 23 ఏళ్ల నర్సు అనుమానాస్పదంగా మృతి చెందింది.

ఛీ.. ఈ సమాజానికి ఏమైంది..? కామంతో కళ్లు మూసుకుపోయే రాక్షసులు ఇంకా ఉన్నారా..? ఎన్ని చట్టాలు వచ్చినా, ఎంతోమంది శిక్షలు అనుభవిస్తున్నా వీళ్ళ బుద్ధులు మాత్రం మారడం లేదు. పవిత్రమైన మానవ సంబంధాలను సైతం వీరు తమ కామవాంఛకు బలి చేస్తున్నారు. వావి వరుసలు మరిచి కామ పిశాచుల్లా మారుతున్నారు. చెల్లి అని పిలుస్తూనే కన్నెత్తి చూడకూడని దారుణానికి ఒడిగడుతున్నారు. అమాయకుల ప్రాణాలు తీస్తూ.. తమ దుర్మార్గపు కోరికలను తీర్చుకుంటున్నారు.

సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం గజసింగవరంలో ఓ అమానవీయ ఘటన చోటు చేసుకుంది. వివాహిత నిండు ప్రాణం, భర్త దూరంగా ఉన్న సమయంలో.. పక్కింటి దుర్మార్గుడి కామవాంఛకు బలైపోయింది. చెల్లి అని పిలుస్తూ ఇంట్లో చొరబడి.. ఆమె ఒంటరితనాన్ని ఆసరాగా చేసుకుని అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు ఆ రాక్షసుడు. ఆ తల్లి ప్రతిఘటించడంతో.. కనికరం లేకుండా కొడవలితో నరికి చంపేశాడు. చేసిన ఘోరానికి భయపడి.. తానూ ఉరి వేసుకుని చనిపోయాడు. మానవత్వం అన్న మాటకు అర్థం కూడా తెలియని ఈ మృగాలకు శిక్ష అంటే ఏమిటో తెలియాలని. వారిని ఉరి తీసినా తక్కువే అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంతోమంది అమాయక మహిళలు ఇలాంటి కామాంధుల వల్ల ప్రాణాలు కోల్పోతున్నారు. వారి కుటుంబాలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాయి. ఈ దుర్మార్గుల వల్ల సమాజంలో మహిళ స్వేచ్ఛగా తిరగలేని పరిస్థితి ఏర్పడింది. చెల్లి అని పిలిచేవాడే ఇంత దారుణానికి ఒడిగడితే.. ఇంక ఎవరిని నమ్మాలి..? మనుషుల రూపంలో తిరుగుతున్న ఈ రాక్షసులను గుర్తించి.. కఠినంగా శిక్షించాలని స్థానికులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆ వివాహిత ఒంటిపై పంటి గాట్లు ఉన్నాయని గుర్తించారు. అంటే ఆ దుర్మార్గుడు ఎంతటి పైశాచికంగా ప్రవర్తించాడో ఊహించవచ్చు. పోస్ట్ మార్టం తర్వాత నిజానిజాలు తెలుస్తాయి. ఈ ఘటనతో గ్రామంలో ఉద్రిక్తత వాతావరణ నెలకొంది.

ఉత్తేజిత దినపత్రిక



# వేతనాల పెంపుపై ఇన్ఫోసిస్ కీలక ప్రకటన..




దేశంలోని రెండో అతిపెద్ద ఐటీ కంపెనీ ఇన్ఫోసిస్.. కీలక ప్రకటన చేసినట్లుగా తెలుస్తోంది. ఎప్పటినుంచో ఉద్యోగులకు వేతనాల పెంపు వాయిదా వేస్తూ వస్తున్న ఈ కంపెనీ ఇప్పుడు ఫిబ్రవరి నెలాఖర్లోగా ఇంక్రిమెంట్ లెటర్స్ అందించనున్నట్లు తెలిసింది. దీని గురించి ఈ వ్యవహారం గురించి తెలిసిన వ్యక్తులు వెల్లడించినట్లు పలు మీడియాల్లో వార్తలు వస్తున్నాయి.

ఐటీ ఉద్యోగులకు గత కొంత కాలంగా గడ్డు పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే. ముఖ్యంగా ఆయా ఐటీ కంపెనీల్లో ఉద్యోగుల సంఖ్య తగ్గుతూ వస్తుండటం ఒక కారణం కాగా.. ఖర్చుల్ని తగ్గించుకోవడంలో భాగంగా ఆయా కంపెనీలు ఉద్యోగుల్ని తొలగిస్తూ కూడా వస్తున్నాయి. ఆర్థిక మందగమనం నేపథ్యంలో.. ఈ రంగానికి డిమాండ్ తగ్గిపోయినట్లుగా తెలుస్తోంది. ముఖ్యంగా అంతర్జాతీయ ప్రముఖ టెక్ కంపెనీలు పెద్ద మొత్తంలో ఉద్యోగుల్ని తొలగించడం.. ఆ తర్వాత ఇదే ఎఫెక్ట్ దేశీయ ఐటీ కంపెనీలపైనా పడటం తెలిసిందే. దీంతో.. ఇక్కడ కూడా ఉద్యోగులకు వేతనాలు పెంచకపోవడం.. ఇతర ప్రోత్సాహకాలు తగ్గించడం.. కొత్తగా ఉద్యోగుల్ని నియమించుకోకపోవడం వంటివి జరిగాయి. అయితే ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి.

ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రముఖ ఐటీ కంపెనీలు కీలక ప్రకటనలు చేశాయి. చాలా వరకు వేతనాల పెంపును ప్రకటించాయి. ఈ ఆర్థిక సంవత్సరం అక్టోబర్- డిసెంబర్ త్రైమాసికంలో మంచి ఫలితాల్ని నమోదు చేయడం ఇందుకు ఒక కారణం. ఇన్ఫోసిస్ కూడా ఫలితాల సందర్భంగా.. దీనిపై ప్రకటన చేయగా.. ఇప్పుడు ఎప్పుడు వేతనాల పెంపు అమల్లోకి వస్తుందో తెలియజేసినట్లు సమాచారం.

ఫిబ్రవరి నెల ఆఖర్లోనే ఇన్ఫోసిస్.. తమ ఉద్యోగులకు వేతనాల పెంపునకు సంబంధించి ఇంక్రిమెంట్ లెటర్స్ అందించనుందంట. అయితే.. సగటున ఉద్యోగులకు 5 నుంచి 8 శాతం వరకు వేతనాల పెంపు ఉంటుందని.. ఇన్ఫోసిస్ వేతనాల పెంపు వ్యవహారం గురించి తెలిసిన కొందరు వ్యక్తులు తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వేతనాల పెంపు ఏప్రిల్ 1 నుంచే అమల్లోకి రానున్నట్లు తెలుస్తోంది. ఇప్పుడిప్పుడే ఐటీకి మళ్లీ డిమాండ్ పెరుగుతుండటం సహా వచ్చే ఆర్థిక సంవత్సరంలో తమ బడ్జెట్ అంచనాలు పెరుగుతాయని టెక్ కంపెనీలు అంచనా వేస్తున్నాయి. మన ఐటీ కంపెనీలకు ఆదాయం ఎక్కువగా నార్త్ అమెరికా నుంచే వస్తుందన్న సంగతి తెలిసిందే. మరోవైపు బ్యాచ్‌ల వారీగా ఇన్ఫోసిస్.. ప్రమోషన్ లెటర్స్ ఇప్పటికే ఇస్తోందని సమాచారం. డిసెంబర్ నెలలోనే తొలి బ్యాచ్‌కు ఇచ్చిందని.. ఇప్పుడు ఫిబ్రవరిలో రెండో దశ ప్రమోషనల్ లెటర్స్ ఇస్తుందని తెలుస్తోంది.

# ఉద్యోగులకు దిగ్గజ టెక్ కంపెనీ షాక్..



దిగ్గజ టెక్ సంస్థ మెటా ప్లాట్ ఫామ్స్ మరోసారి షాకింగ్ నిర్ణయం తీసుకుంది. భారీగా ఉద్యోగుల తొలగింపులకు సిద్ధమైంది. ఈసారి ఏకంగా 4 వేల మందికి పింక్ స్లిప్స్ ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి 10నే ఉద్యోగులకు మెమోలు అందించనుందని పలు మీడియా నివేదికుల చెబుతున్నాయి. ఆ వివరాలు తెలుసుకుందాం.

ప్రపంచ స్థాయి టెక్ దిగ్గజం, ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటా ప్లాట్ ఫామ్స్ తమ ఉద్యోగులకు షాకిచ్చింది. మరోసారి భారీగా తొలగింపులకు సిద్ధమైంది. ఈసారి సంస్థలోని మొత్తం ఉద్యోగుల్లో 5 శాతం మేర తొలగిస్తున్నట్లు తెలుస్తోంది. అంటే దాదాపు 4000 మందిపై ప్రభావం పడనుందని అంతర్జాతీయ మీడియాలు పేర్కొంటున్నాయి. ఫిబ్రవరి 10వ తేదీనే లేఆఫ్స్‌కి సంబంధించిన మెమోలు ఉద్యోగులు అందించనున్నారని సమాచారం. ఇందుకు సంబంధించిన ఓ మెమో లీకైనట్లు బిజినెస్ ఇన్‌సైడర్ న్యూస్ సంస్థ ఓ కథనం ప్రచురించింది. కంపనీలో పని తీరు సరిగా లేని ఉద్యోగులను తొలగిస్తున్నట్లు మెటా వర్గాలు తెలిపినట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ ఏడాది మెటో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోసం భారీగా పెట్టుబడి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఈ కారణంగానే ఒక్కసారిగా భారీ లేఆఫ్స్‌కి తెరతీసినట్లు టెక్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ నిర్ణయంతో కంపెనీలోని 5 శాతం మంది ఉద్యోగులపై ప్రభావం పడనుంది. ఈ విషయంపై గత నెలలో సిబ్బందితో మాట్లాడిన కంపెనీ సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ క్లారిటీ ఇచ్చారు. సరైన పని తీరు లేని వారిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

ఆసియా, ఆఫ్రికా, యూరప్ సహా అంతర్జాతీయంగా మొత్తం 12 దేశాల్లో ఈ లేఆఫ్స్ ఉంటాయని కంపెనీ వర్గాలు తెలిపాయి. అయితే, ఉద్యోగాలు కోల్పోయిన వారికి సంస్థ నుంచి అందాల్సిన ఆర్థిక, వృత్తి పరమైన సహాయం అందుతుందని మార్క్ జుకర్‌బర్గ్ తెలిపారు. ఈసారి 3000 మంది ఉద్యోగులను తొలగిస్తున్నారని తొలుత వార్తలు వచ్చాయి. ఆ తర్వాత ఆ సంఖ్య 4 వేలకు చేరినట్లు తెలుస్తోంది. భారీగా లేఆఫ్స్ చేపట్టడం టెక్ ఉద్యోగుల్లో మళ్లీ ఆందోళనలు పెంచుతోంది.

కోవిడ్-19 మహమ్మారి విజృంభణ తర్వాత టెక్, ఐటీ ఇండస్ట్రీలో భారీగా లేఆఫ్స్ జరిగిన సంగతి తెలిసిందే. అయితే, గతేడాది నుంచి కాస్త కోలుకున్నప్పటికీ ఉద్యోగుల్లో మాత్రం ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే దిగ్గజ టెక్ సంస్థలైన మైక్రోసాఫ్ట్, అమెజాన్, సేల్స్ ఫోర్స్ వంటి ఇతర సంస్థలు వేలాది మంది ఉద్యోగులను తొలగిస్తున్నట్లు ప్రకటించడం గమనార్హం. దీంతో మరోసారి టెక్ ఉద్యోగుల భవిష్యత్తు అయోమయంలో పడిపోయిందని చెప్పవచ్చు. చాలా సంస్థలు ఉద్యోగుల పనితీరుపై ఫోకస్ పెట్టాయి. సరిగా లేని ఉద్యోగులను ఇళ్లకు పంపించేస్తున్నాయి.

# మ్యూచువల్ ఫండ్ కీలక నిర్ణయం..



దేశీయ దిగ్గజ అసెట్ మేనేజ్మెంట్ కంపెనీల్లో ఒకటైన టాటా మ్యూచువల్ ఫండ్ కీలక నిర్ణయం తీసుకుంది. తమ ఏఎంసీకి చెందిన రెండు పాపులర్ ఈక్విటీ ఫండ్ పథకాలను విలీనం చేస్తేందుకు ఆమోదం తెలిపింది. టాటా క్వాంట్ ఫండ్ టాటా ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ స్కీమ్స్ విలీనం కానున్నాయి. క్వాంట్ ఫండ్‌ను ట్రాన్స్‌ఫర్ స్కీమ్‌గా వ్యవహరిస్తారు. ఇక ఫ్లెక్సీ క్యాప్ ఫండ్‌ను సర్వైవింగ్ స్కీమ్‌గా వ్యవహరిస్తారు. అంటే ఫ్లెక్సీ క్యాప్ ఫండ్‌గా అందుబాటులో ఉండనుందని అర్థమవుతోంది. ఈ రెండు ఫండ్స్ విలీనం చేసేందుకు రికార్డ్ తేదీని మార్చి 21, 2025గా టాటా మ్యూచువల్ ఫండ్స్ నిర్ణయించింది. ఈ మేరకు తమ యూనిట్ హోల్డర్లకు నోటీసుల ద్వారా సమాచారం అందించింది.

సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (మ్యూచువల్ ఫండ్స్) రెగ్యులేషన్స్ 1996లోని రెగ్యులేషన్ 18ప్రకారం ఈ విలీనం ఉండనుందని టాటా మ్యూచువల్ ఫండ్ తెలిపింది. 30 రోజుల్లోగా ఈ విలీనం అమలులోకి రానుంది. మెర్జర్ స్కీమ్ కి చెందిన యూనిట్ హోల్డర్లకు ఎలాంటి ఎగ్జిట్ లోడ్ ఉండదు. అంటే టాటా క్వాంట్ ఫండ్ యూనిట్ హోల్డర్లు ఫ్లెక్సీ క్యాప్ ఫండ్‌లోకి మారతారని, ఈ మార్పు సమయంలో ఎలాంటి ఛార్జీలు ఉండవని నోటీసులో పేర్కొంది. ఈ క్రమంలో ఫిబ్రవరి 13, 2025 నుంచి టాటా క్వాంట్ ఫండ్ యూనిట్ల విక్రయాలను నిలిపివేస్తున్నట్లు తెలిపింది.

విలీనం అయ్యే స్కీమ్ టాటా క్వాంట్ ఫండ్ యూనిట్ హోల్డర్లకు రాతపూర్వక సమాచారాన్ని అందిస్తున్నట్లు టాటా మ్యూచువల్ ఫండ్ తెలిపింది. కొత్త స్కీమ్ టాటా ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ ఎన్ని యూనిట్లు వస్తాయి, పన్ను సమస్యలు ఏముంటాయి, ఆర్థిక సమాచారం వంటి వివరాలు అందిస్తున్నట్లు పేర్కొంది. రికార్డ్ తేదీ మార్చి 21 నుంచి టాటా క్వాంట్ ఫండ్ యూనిట్ హోల్డర్లు టాటా ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ యూనిట్ హోల్డర్లుగా మారనున్నారు.

మరోవైపు.. ప్రస్తుత నియంత్రణ అవసరాల పరంగా టాటా క్వాంట్ ఫండ్లలోని యూనిట్ హోల్డర్లు విలీనానికి అనుకూలంగా లేకుంటే ఎటువంటి నిష్క్రమణ లోడ్ లేకుండా ప్రస్తుత నికర ఆస్తి విలువ వద్ద యూనిట్లు విక్రయించేందుకు ఒక ఆప్షన్ ఇస్తారు. విలీనానికి అంగీకరించని యూనిట్ హోల్డర్లు ఫిబ్రవరి 19, 2025 నుంచి మార్చి 20, 2025 వరకు ఎగ్జిట్ ఆఫర్ ఉంటుంది. మార్చి 20, 2025 నాటికి ఎలాంటి రిడంప్షన్ లేదా స్విచ్ రిక్వెస్ట్ రాకుంటే ఆటోమేటిక్‌గా టాటా క్వాంట్ ఫండ్ యూనిట్లు టాటా ఫ్లెక్సీ క్యాప్ ఫండ్‌గా మారతాయి.

# 7 రోజుల్లో 40 శాతం జంప్!

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు బుధవారం సెషన్లో ఆరంభంలో భారీగా పడిపోగా.. ఆఖర్లో తేరుకున్నాయి. అయినప్పటికీ నష్టాల్లోనే ముగిశాయి. గత 5 సెషన్లు మాత్రం స్టాక్ మార్కెట్లు కుప్పకూలిపోయిన సంగతి తెలిసిందే. మార్కెట్లు భారీగా పడిపోయినప్పటికీ ఒక స్టాక్ మాత్రం 7 సెషన్లుగా అప్పర్ సర్క్యూట్ కొడుతూనే ఉంది. దీని గురించి చూద్దాం.

స్టాక్ మార్కెట్లు గత కొద్ది రోజులుగా తీవ్ర ఒడుదొడుకుల్లో లోనవుతున్న సంగతి తెలిసిందే. ముఖ్యంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న కఠిన నిర్ణయాలు.. మార్కెట్లో అనిశ్చితికి కారణమవుతోంది.

ట్రంప్ వరుసగా దిగుమతి సుంకాలు విధిస్తుండగా.. భారత స్టాక్ మార్కెట్లపైనా ఈ ప్రభావం కనిపిస్తోంది. ఇవాళ్టితో (బుధవారం) మినహాయిస్తే గత 5 సెషన్లలో చూసినట్లయితే సెన్సెక్స్ ఏకంగా 2 వేల పాయింట్లకుపైగా పడిపోయింది. నిఫ్టీ కూడా భారీగానే పతనమైంది. ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ రూ. 17 లక్షల కోట్లకుపైగా తగ్గింది. అయితే బుధవారం సెషన్లో మాత్రం కాస్త ఊరట దక్కింది.

ఫిబ్రవరి 12న కూడా ఆరంభంలో స్టాక్ మార్కెట్లు భారీగా పడిపోయాయి. ఒక దశలో సెన్సెక్స్ 900 పాయింట్లకుపైగా పడిపోగా.. ఇంట్రాడేలో తేరుకుంది.




మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో లాభాల్లోకి వచ్చిన సూచీలు ఆఖర్లో మాత్రం స్వల్ప నష్టాలతో ముగించాయి. సెన్సెక్స్ చివరకు 120 పాయింట్లకుపైగా పడిపోయి 761,71 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 26 పాయింట్లు తగ్గి 23,045 వద్ద స్థిరపడింది.

అయితే గత కొన్ని రోజులుగా మార్కెట్లు ఇలా నష్టపోతున్నప్పటికీ.. ఒక స్టాక్ గురించి మనం ప్రధానంగా మాట్లాడుకోవాలి. మార్కెట్ లాభనష్టాలతో సంబంధం లేకుండా ఇది వరుసగా అప్పర్ సర్క్యూట్స్ కొడుతూనే ఉండటం విశేషం. అదే శ్రీ అధికారి బ్రదర్స్ టెలివిజన్ నెట్‌వర్క్ లిమిటెడ్. బుధవారం సెషన్లో ఈ స్టాక్ 5 శాతం అప్పర్ సర్క్యూట్ కొట్టి రూ. 522.10 వద్ద స్థిరపడింది. ఈ క్రమంలోనే వరుసగా వారం రోజులుగా ఈ స్టాక్ అప్పర్ సర్క్యూట్లోనే ఉండటం విశేషం.

చివరగా ఫిబ్రవరి 3న ఈ స్టాక్ ధర రూ. 371.15 వద్ద ఉండగా.. ఫిబ్రవరి 4, 5, 6, 7, 10, 11, 12 ఇలా వరుసగా ఏడో సెషన్లో కూడా 5 శాతం అప్పర్ సర్క్యూట్ కొట్టింది. దీంతో ఇన్వెస్టర్లు పండగ చేసుకున్నారని చెప్పొచ్చు. ఇక కంపెనీ మార్కెట్ విలువ రూ. 1.32 వేల కోట్లుగా ఉంది. స్టాక్ 52 వారాల గరిష్ట విలువ రూ. 2219.95 కాగా.. కనిష్ట ధర రూ. 41.25 గా ఉంది.

గత 5 రోజుల్లో 21 శాతానికిపైగా పెరిగింది. నెలలో మాత్రం 40 శాతానికిపైగా నష్టాల్ని అందించింది. ఏడాది వ్యవధిలో చూస్తే 1100 శాతానికిపైగా రిటర్న్స్ అందించింది. ఐదేళ్లలో చూస్తే 38 వేల శాతానికిపైగా పెరగడం మరో విశేషం.

అయితే మార్కెట్లలో ఇన్వెస్ట్ చేసే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం మర్చిపోవద్దు. అప్పుడు మాత్రమే ఎక్కువగా రిస్క్ లేకుండా రిటర్న్స్ అందుకోవచ్చు.

# అమెరికన్లలో తీవ్ర భయాందోళనలు



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వంలో ఎలాన్ మస్క్ చాలా కీలక వ్యక్తిగా మారారు. ఇప్పటికే ఆయనకు డోజ్ బాధ్యతలు అప్పగించిన ట్రంప్.. తాజాగా మరిన్ని అధికారాలను కట్టబెట్టారు. దీంతో ఎలాన్ మస్క్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో అని అమెరికన్లలో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. అమెరికా ప్రభుత్వ ఉద్యోగాల్లో కోతలు విధించి.. అనవసర ఖర్చును నియంత్రించేందుకు చర్యలు తీసుకోవడంలో భాగంగా ట్రంప్, మస్క్ అనేక సంచలన నిర్ణయాలకు తెరతీస్తున్నారు.

రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్.. తన 2.0 పాలనలో సంచలన నిర్ణయాలు ఉంటాయని మొదటి నుంచీ చెబుతూనే ఉన్నారు. వృథా ఖర్చులు తగ్గించి.. ప్రభుత్వ ఖజానాపై భారం తగ్గిస్తానని చెప్పారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి నియామకాలు, తొలగింపులు చూసుకునేందుకు.. డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియన్సీ-డోజ్‌ను ట్రంప్ ఏర్పాటు చేశారు. ఈ డోజ్ బాధ్యతలను ప్రపంచ అపర కుబేరుడు.. టెస్లా, స్పేస్ ఎక్స్, ట్విటర్ సంస్థల అధినేత ఎలాన్ మస్క్‌కు అప్పగించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే చర్యలు చేపట్టిన డోజ్.. అధికంగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగులను ఉద్యోగాల నుంచి తొలగించింది. మరోవైపు.. తాజాగా ఎలాన్ మస్క్‌కు మరిన్ని అధికారులు ట్రంప్ కట్టబెట్టడంతో అమెరికాలో భారీగా ఉద్యోగాల కోతలు ఉంటాయని అమెరికన్ల భయపడిపోతున్నారు.

తాజాగా ఎలాన్ మస్క్ నేతృత్వంలోని డోజ్‌కు మరిన్ని అధికారాలు కల్పించే ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై డొనాల్డ్ ట్రంప్ సంతకం చేశారు. అయితే ట్రంప్ సంతకం చేసే సమయంలో ఓవల్ ఆఫీస్‌లో ఎలాన్ మస్క్ తన నాలుగేళ్ల కుమారుడు %శ్ర ాూ-శఱఱ% తో కలిసి ఉండడం గమనార్హం. ఈ నిర్ణయంతో అమెరికాలో భారీగా ప్రభుత్వ ఉద్యోగాల కోతలు ఉండనున్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు. ఇక నుంచి అమెరికా ఫెడరల్ ఏజెన్సీలు.. డోజ్‌ను సంప్రదించిన తర్వాతే ఉద్యోగులను నియమించుకోవడం, తొలగించడం చేయాలని తాజాగా జారీ చేసిన ఉత్తర్వుల్లో ట్రంప్ వెల్లడించారు. ప్రతీ ఫెడరల్ ఏజెన్సీ తక్కువ ఉద్యోగులతో పనిచేయాలని.. అవసరమైన మేరకు మాత్రమే కొత్త ఉద్యోగులను తీసుకోవాలని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా డోజ్ పనితీరును డొనాల్డ్ ట్రంప్ ప్రశంసలు గుప్పించారు. ఇక డోజ్ తీసుకుంటున్న నిర్ణయాలపై దావాలు నమోదు అవుతున్నా.. వాటిని పట్టించుకోకుండా ముందుకు సాగాలని మస్క్‌కు సూచించారు. అమెరికా ప్రభుత్వంలో భారీ సంస్కరణలు తీసుకువచ్చేందుకే రిపబ్లికన్ పార్టీని అమెరికన్లు



ఓటు వేసి గెలిపించారని ఎలాన్ మస్క్ తెలిపారు. అందుకే ఈ నిర్ణయాలు తీసుకుంటున్నామని.. ప్రజాస్వామ్యం అంటే ఇదే అని పేర్కొన్నారు. పారదర్శకంగా పనిచేసేందుకు డోజ్ ఎల్లప్పుడూ ప్రయత్నిస్తుందని వివరించారు. వృథా ఖర్చులు, అనవసర ఉద్యోగులను తగ్గించకపోతే అమెరికా దివాలా తీస్తుందని ఎలాన్ మస్క్ వెల్లడించారు.

# 7 వేలకు పైగా కోళ్లను చంపిన మహారాష్ట్ర సర్కారు!

రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్రను బర్డ్ ఫ్లూ కుదిపేస్తోంది. ఇప్పటికే బర్డ్ ఫ్లూ కారణంగా అనేక కోళ్లు, పక్షులు, జంతువులు మృత్యువాత పడగా.. తాజాగా మహారాష్ట్ర సర్కారే కోళ్లను చంపేస్తోంది. అలాగే బర్డ్ ఫ్లూ ప్రభావిత ప్రాంతాల నుంచి వచ్చే గుడ్లను సైతం నాశనం చేస్తోంది. బర్డ్ ఫ్లూ వ్యాప్తి చెందకుండా ఉండాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సర్కారు చెబుతుండగా.. ప్రజలంతా తీవ్రంగా భయపడిపోతున్నారు.

మహారాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది జనవరి ఒకటవ తేదీ నుంచి బర్డ్ ఫ్లూ ప్రభావిత ప్రాంతమైన 7 ప్రాంతాలను గుర్తించింది. ఈక్రమంలోనే అక్కడ ఉన్న 7,200 కోళ్లను చంపేసింది. అలాగే 2 వేల 230 గుడ్లను నాశనం చేసింది. చంద్రపూర్ జిల్లాలోని మంగ్లీ గ్రామంలో తాజాగా బర్డ్ ఫ్లూ వ్యాప్తిని చెందింది. ఈక్రమంలోనే అక్కడి నుంచి 5 కిలో మీటర్ల దూరంలో ఉన్న అన్ని గ్రామాల్లో ఇప్పటికే 2,065 కోళ్లు చనిపోయాయి.

అయితే విషయం గుర్తించిన రాష్ట్ర పశు సంవర్ధక శాఖ అధికారులు ప్రభావిత ప్రాంతం నుంచి 5 కిలో మీటర్ల దూరంలో ఉన్న అన్ని కోళ్లు, గుడ్లు, పశుగ్రాసాన్ని నాశనం చేయాలని నిర్ణయించింది. ఈక్రమంలోనే చంద్రాపూర్ జిల్లాలో 1,165 గుడ్లతో పాటు 50 కిలోల దాణాను నాశనం చేయించింది. అలాగే కోళ్ల పెంపకం దారులకు నష్ట పరిహారంగా రూ.2,91,963 అందించారు. ఫిబ్రవరి 6వ తేదీ వరకు మహారాష్ట్రలోని లాతూర్, నాందేడ్, నాగ్‌పూర్, థానే, రాయ్‌గఢ్, చంద్రాపూర్ జిల్లాల నుంచి ఇప్పటి వరకు మొత్తంగా 7 బర్డ్ ఫ్లూ ప్రభావిత కేంద్రాలను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ముఖ్యంగా లాతూర్ జిల్లాలోని ఉద్గిర్ తాలూకాలో 71 కాకులు చనిపోయాయి. ఈక్రమంలోనే వీటికి పరీక్షలు చేయగా.. బర్డ్ ఫ్లూ కారణంగానే ఇవి ప్రాణాలు కోల్పోయినట్లు గుర్తించారు. కేవలం కాకులు, కోళ్లలోనే కాకుండా పులులు, చిరుతలు, రాబందుల్లోనూ బర్డ్ ఫ్లూ నిర్ధారణ అయినట్లు వివరించారు. అలాగే నాగ్‌పూర్‌లోని గోరేవాడ రెస్క్యూ సెంటర్‌లో ఉంచిన 3 పులులు, ఒక చిరుత పులి సహా 693 జంతువులు, పక్షులు బర్డ్ ఫ్లూ కారణంగా చనిపోయిట్లు తెలిపారు. ముఖ్యంగా ఇందులో మూడు తెల్లటి వీపు గల రాబందులు కూడా ఉన్నట్లు చెప్పారు. పశుసంవర్ధక శాఖ అధికారులు మాట్లాడుతూ.. వ్యవస్థీకృత పౌల్ట్రీ సంస్థల నుంచి ఇప్పటి వరకు ఒక్క కేసు కూడా నివేదించబడలేదని తెలిపారు. కోళ్ల ఫాంల యజమానులు బయో భద్రతా చర్యలు చేపట్టారని.. ముఖ్యంగా కోళ్లు వలస పక్షులతో సంబంధంలోకి రాకుండా చూసుకుంటున్నాయని చెప్పుకొచ్చారు. వీటి వల్లే బర్డ్ ఫ్లూ వ్యాప్తిని నివారించవచ్చని స్పష్టం చేశారు.

# ప్రపంచంలోనే అవినీతి దేశంగా దక్షిణ సూడాన్

ప్రపంచంలోనే అత్యంత అవినీతి కలిగిన దేశంగా ఈ ఏడాది దక్షిణ సూడాన్ చెత్త రికార్డు సృష్టించింది. ఇక అవినీతి అతి తక్కువ ఉన్న దేశంగా డెన్మార్క్ తొలి స్థానంలో నిలిచింది. ఈ అవినీతి దేశాల జాబితాలో భారత్ 96వ స్థానంతో సరిపెట్టుకుంది. అది గత ఏడాదితో పోల్చితే 3 స్థానాలు పడిపోయింది. మొత్తం ప్రపంచంలోనే 180 దేశాలతో జాబితా రూపొందించింది. అయితే గత 3 ఏళ్లుగా వరుసగా భారత్ స్థానం పడిపోతుండటం గమనార్హం.

2024 ఏడాదికి సంబంధించి ప్రపంచంలోనే అత్యంత అవినీతి ఉన్న దేశాల జాబితా తాజాగా విడుదలైంది. గతేడాదికి సంబంధించి కరప్షన్ పెర్సెప్షన్స్ ఇండెక్స్‌ను ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ అనే సంస్థ విడుదల చేసింది. మొత్తం 180 దేశాలకు సంబంధించిన అవినీతి సూచీని విడుదల చేసింది. ఈ జాబితాలో భారత్ స్థానం మరోసారి పడిపోయింది. 2023 ఏడాదిలో 93వ స్థానంలో ఉన్న భారత్.. 2024కు వచ్చే సరికి మూడు స్థానాలు పడిపోయి.. 96వ స్థానంలో నిలిచింది. ప్రతీ సంవత్సరం నిపుణులు, వ్యాపారవేత్తల దృష్టిలో ఆయా దేశాల్లో అవినీతి ఎలా ఉంది అనే అంచనాలతో ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ వెల్లడించింది. టాప్-5లో డెన్మార్క్, ఫిన్లాండ్,



సింగపూర్, న్యూజిలాండ్, లక్సంబర్గ్ నిలిచాయి.

ఆయా దేశాల్లో ఉండే అవినీతిని బట్టి ఈ సూచీలో 0 నుంచి 100 వరకు స్కోర్‌ను కేటాయించారు. సున్నా స్కోర్ ఉంటే అత్యంత అవినీతి దేశంగా.. 100 స్కోర్ సాధిస్తే అసలు అవినీతి లేని దేశంగా పరిగణిస్తారు. ఈ లిస్ట్‌లో మొట్టమొదటి స్థానంలో డెన్మార్క్ నిలిచింది. 100 స్కోరుకు గానూ డెన్మార్క్ 90 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. డెన్మార్క్ తర్వాత 88 పాయింట్లతో ఫిన్లాండ్ రెండో స్థానంలో ఉంది. మరోవైపు.. 84 పాయింట్లతో సింగపూర్ మూడో స్థానంలో.. 83 పాయింట్లతో న్యూజిలాండ్ నాలుగో స్థానంలో.. 81 పాయింట్లతో లక్సంబర్గ్ ఐదో స్థానంలో నిలిచాయి.

ఇక అవినీతి దేశాల జాబితాలో భారత్ 96వ స్థానంలో ఉన్నట్లు ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ వెల్లడించింది. 100 పాయింట్లకు గానూ భారత్ కేవలం 38 స్కోరు సాధించినట్లు పేర్కొంది. అయితే అంతకుముందు ఏడాది 2023లో 39 పాయింట్లతో భారత్ 93వ స్థానంలో ఉండగా.. 2024 ఏడాదిలో మాత్రం మూడు స్థానాలు పడిపోయి 96వ స్థానంలో నిలిచింది. అంతకుముందు 2022లో 40 పాయింట్లతో 85వ స్థానంలో భారత్ నిలిచింది. ఇక ఈ జాబితాలో చైనా 76వ స్థానంలో ఉంది. భారత్‌కు పొరుగున ఉన్న దేశాలైన పాకిస్తాన్ 27 పాయింట్లతో 135వ ర్యాంకులో ఉంది. 32 పాయింట్లతో శ్రీలంక 121వ ర్యాంకు.. బంగ్లాదేశ్ 149వ ర్యాంకులో ఉన్నాయి. తాలిబన్‌లు పాలిస్తున్న ఆఫ్ఘనిస్థాన్ కేవలం 17 పాయింట్లతో 165వ స్థానంలో ఉంది. ఇక ఈ అవినీతి దేశాల జాబితాలో అత్యంత అవినీతిమయమైన దేశంగా దక్షిణ సుడాన్ నిలిచింది. కేవలం 8 పాయింట్లతో ఈ లిస్ట్‌లో అట్టడుగున 180వ స్థానంలో నిలిచింది. కింది నుంచి రెండో స్థానంలో 9 పాయింట్లతో 179వ స్థానం.. 10 పాయింట్లతో వెనుజులా 178వ స్థానం.. 12 పాయింట్లతో సిరియా 177వ స్థానం.. లిబియా 13, ఈక్వటోరియల్ గునియా 13, నికరాగ్వా 15తో అత్యంత అవినీతిమయమైన దేశాలుగా నిలిచాయి.

# ఉచితాలతో ప్రజలను సోమరులుగా మారుస్తున్నారు..

ఎన్నికలకు ముందు రాజకీయ పార్టీలు ఇచ్చే ఉచిత వాగ్దానాలపై సర్వోన్నత న్యాయస్థానం మరోసారి తీవ్రంగా స్పందించింది. ఈ హామీలను తప్పుపట్టిన సుప్రీంకోర్టు... ఉచిత ప్రకటనలు సరికాదని హితవు పలికింది. ఆ విధానాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని.. ఇది ప్రజలను సోమరులుగా మారుస్తుందని వ్యాఖ్యానించింది. ఉచిత రేషన్, డబ్బు అందడం వల్ల ఎవరూ పనిచేయడానికి కూడా ఇష్టపడటం లేదని, ఇలాంటివి మానుకోవడం ఉత్తమమని అభిప్రాయపడింది. గతంలోనూ సుప్రీంకోర్టు ఇలాంటి వ్యాఖ్యలు చేసింది.

ఉచితాలపై సర్వోన్నత న్యాయస్థానం మరోసారి కీలక వ్యాఖ్యలు చేసింది. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ప్రకటించిన ఉచితాలను తప్పుబట్టింది. ఉచితంగా రేషన్, నగదు అందుతుండటంతో ప్రజలు పనిచేయడానికి ఇష్టపడటం లేదని వ్యాఖ్యానించింది. ఉచితాలతో పని చేయకుండా ఆహారం, డబ్బు సంపాదిస్తున్నారని పేర్కొంది. ఎన్నికల్లో ఉచిత పథకాలను ప్రకటించే విధానం మంచిది కాదని అభిప్రాయపడింది. ఉచిత పథకాలతో లబ్దిదారులను పరాన్నజీవులుగా మారుస్తున్నామని జస్టిస్ బిఆర్ గవాయ్ మండిపడ్డారు. పట్టణ ప్రాంతాల్లో నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించాలన్న పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ మేరకు స్పందించింది. ఈ అంశంపై విచారణను ఆరు వారాల పాటు వాయిదా వేసింది.

జనవరిలోనూ సుప్రీంకోర్టు ఇలాంటి వ్యాఖ్యలే చేసింది. ఎన్నికలు రాగానే లాడ్లీ బెహెన్‌తో పాటు పలు పథకాలను ప్రకటించి.. సొమ్ములను పంచిపెడతారని మండిపడింది. ఢిల్లీలో ఇప్పుడు ఓ పార్టీ రూ.2,500 ఇస్తామంటే.. ఇంకో పార్టీ తాము దీనికి రెట్టింపు ఇస్తామని హామీ ఇస్తుందని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఉచితాలకు డబ్బులు ఉంటాయని, కోర్టుల్లో పనిచేసే ఉద్యోగులకు జీతాలు ఇవ్వడానికి మాత్రం ఉండవని తూర్పారబట్టింది. గతంలో సీనియర్ న్యాయవాది అశ్వినీ ఉపాధ్యాయ్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సమయంలో ఉచితాలు అంటే ఏమిటి? అని సర్వోన్నత న్యాయస్థానం ప్రశ్నించింది. దీనిని తాము అడ్డుకోలేమని తేల్చిచెప్పింది. అంతేకాదు, సార్వత్రిక ఆరోగ్య సంరక్షణ, తాగునీరు వంటివి సౌకర్యాలు ఉచితాలుగా పరిగణించవచ్చా? ప్రజల హక్కా..? అని ప్రశ్నించింది

అయితే, ఉచితాలపై అసహనం వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు.. 2013లో సుబ్రమణ్యం బాలాజీ కేసులో మాత్రం భిన్నమైన వ్యాఖ్యలు చేసింది. 'అర్హులైన వ్యక్తులకు కలర్ టీవీలు, ల్యాప్‌టాప్‌లు మొదలైన వాటి రూపంలో పెద్ద మొత్తంలో పంపిణీ చేయడం అనేది నేరుగా రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు సంబంధించింది.. ఇందులో జోక్యం చేసుకోలేము' అని కోర్టు స్పష్టం చేసింది. కాగా, ఇటీవల జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలూ పోటాపోటీగా ఉచితాలను ప్రకటించాయి. దీనిని సవాల్ చేస్తూ ఢిల్లీ హైకోర్టులో ఓ పిటిషన్ దాఖలైంది. రాజకీయ పార్టీలు ప్రకటించే ఉచిత తాయిలాలు.. నగదు ఆధారిత పథకాలపై అత్యవసర విచారణ చేపట్టాలని కోరారు. దీనిని పరిశీలించిన హైకోర్టు. అత్యవసరంగా విచారించేందుకు నిరాకరించింది

# యువతలో పెరుగుతున్న క్యాన్సర్ కేసులు




క్యాన్సర్ రేట్ పెరిగిందని ఓ తాజా అధ్యయనం స్పష్టం చేసింది. ప్రధానంగా 50 ఏళ్లకంటే తక్కువ వయస్సు ఉన్న వ్యక్తులలో క్యాన్సర్ కేసులు పెరిగాయని స్పష్టం చేసింది. నెట్‌వర్క్ ఓపెన్‌లో ఇటీవల ప్రచురించిన అధ్యయనం ప్రకారం, యువతలో అత్యధిక సంఖ్యలో క్యాన్సర్ కేసులు పెరిగాయాని స్పష్టం చేసింది. అధ్యయనం ప్రకారం, యువతలో అత్యధిక సంఖ్యలో క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయని తెలిపింది. పెద్దప్రేగు క్యాన్సర్‌తో సహా జీర్ణశయాంతర క్యాన్సర్‌లు, అన్ని రకాల క్యాన్సర్‌ల కంటే.. 14.80% ఎక్కువగా పెరుగుతున్నాయి. పరిశోధన ఏమి గుర్తించింది.. ఈ పరిశోధనలో 2010 నుంచి 2019 మధ్య కాలంలో 50,000కు పైగా క్యాన్సర్ కేసులను పరిశీలించారు. దీనిలో 50 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న క్యాన్సర్ పేషెంట్స్‌పై ముందస్తుగా దృష్టి సారించింది. ఈ కాలవ్యవధిలో 50 ఏళ్ల కంటే తక్కువ వయస్సు ఉన్నవారిలో క్యాన్సర్ రేటు పెరిగిందని గుర్తించారు. ఇది సంవత్సరానికి సగటున 0.28% పెరుగుదల ఉంది. అపెండిక్స్ క్యాన్సర్ కేసులు 252% పెరిగాయి, పిత్త వాహిక క్యాన్సర్లు 142% పెరిగాయి, గర్భాశయ క్యాన్సర్లు 76% పెరిగాయని ఈ అధ్యయనంలో గుర్తించారు.



**మహిళల్లో ఎక్కువ..**
మహిళల్లో సగటున 4.4% క్యాన్సర్ కేసులు పెరిగినట్లు ఈ అధ్యయనంలో గుర్తించారు. అయితే పురుషులలో 4.91 శాతం క్యాన్సర్ రేట్ తగ్గింది. యాభై ఏళ్లు పైబడిన వారిలో క్యాన్సర్ నిర్ధారణ రేట్లు తగ్గాయని గుర్తించారు. ముప్పైల్లో... క్యాన్సర్ రేటు పెరిగిందని కనుగొన్నారు. యువకులలో జాతి ఆధారంగా పరిశీలించినప్పుడు.. అమెరికన్-ఇండియన్ లేదా అలాస్కా స్థానికులు, ఆసియన్లలో క్యాన్సర్ రేటు ఎక్కువగా ఉంది. శ్వేతజాతీయులలో వృద్ధి రేట్లు స్థిరంగా ఉంది, నల్లజాతీయులలో తగ్గింది.

# బెండకాయల్ని రెగ్యులర్‌గా తింటే...



బెండకాయలు.. వీటిని ఎక్కువగా తింటారు. ఈ కూరగాయతో కూర, సాంబార్, రసం ఇలాచేసుకుని తింటారు. ఎక్కువగా వీటిని కూరలా చేసుకుని తింటారు. అయితే, వీటిని రెగ్యులర్‌గా తింటే చాలా సమస్యలు దూరమవుతాయి. అవేంటో పూర్తిగా తెలుసుకోండి.
పోషకాలు.. బెండకాయలో విటమిన్ ఎ ఉంటుంది. కాబట్టి, ఇది కంటి ఆరోగ్యానికి చాలా మంచిది. అదే విధంగా విటమిన్ కె స్ట్రోక్ వంటి సమస్యలు దూరమవుతాయి. ఇందులో కాల్షియం ఉంటుంది. ఇవి ఎముకలు, దంతాల ఆరోగ్యానికి చాలా మంచిది. అంతేకాదు, ఇందులో మెగ్నీషియం ఉంటుంది. ఇది నాడీ వ్యవస్థని మెరుగ్గా చేస్తుంది. మానసిక ఆరోగ్యాన్ని కాపాడుతుంది.
క్యాన్సర్ కణాలు.. బెండకాయలు బాడీలో మంటను తగ్గిస్తాయి. ముఖ్యంగా ఇందులోని యాంటీ ఆక్సిడెంట్స్ కణాల్లో మంటని తగ్గిస్తాయి. ఇది శరీరం నుండి ఫ్రీ రాడికల్స్ తొలగించడంలో, శరీరంలో మంటను తగ్గించంలో హెల్ప్ చేస్తుంది. అంతేకాకుండా, బెండకాయల్లో క్యాన్సర్ కణాలను చంపి, వాటిని అభివృద్ధి చెందకుండా చేసే సామర్థ్యం ఉంది. కాబట్టి. వీటిని తీసుకోండి.







కొలెస్ట్రాల్ తగ్గడం.. కొలెస్ట్రాల్‌తో ఎన్నో ఆరోగ్య సమస్యలు వస్తాయి. అయితే, కొలెస్ట్రాల్‌ని తగ్గించడంలో ఫైబర్ కీ రోల్ పోషిస్తుంది. అందుకే ఫైబర్ ఎక్కువగా ఉన్న బెండకాయల్ని తీసుకుంటే బాడీలోని కొలెస్ట్రాల్ తగ్గిస్తుంది. దీంతో పాటు బరువు కూడా తగ్గుతారు. ఎందుకంటే ఫైబర్ తీసుకుంటే కడుపు నిండిన ఫీలింగ్ వస్తుంది. కాబట్టి, ఎక్కువగా తినరు. బరువు తగ్గడానికి హెల్ప్ అవుతుంది.
జీర్ణ సమస్యలు.. నేటి కాలంలో చాలా మంది జీర్ణ సమస్యలతో బాధపడతారు. అలాంటి వారికి గుండెల్లో మంట, ఎక్కువగా ఆమ్లత్వం, గుండెల్లో మంట వంటి అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటారు. కానీ, జీర్ణ సమస్యల్ని తగ్గించడంలో బెండకాయలు బాగా పనిచేస్తాయి.
జిగురు తగ్గాలంటే.. అదే విధంగా, బెండకాయల్ని వండడానికి చాలా మంది ఇష్టపడరు. అందుకు కారణం. అందులో జిగురు ఉంటుంది. అలా కాకుండా ఉండాలంటే వీటిని ముక్కలుగా కట్ చేసి కాసేపు ఫ్యాన్ కింద ఆరబెట్టండి. ఆ తర్వాత దీనిని వండండి. అదే విధంగా, వీటిని వండే ముందు కాసేపు ఫ్రై చేయండి. దీంతో జిడ్డు అనేదే ఉండదు.

# త్వరగా బరువు తగ్గుతారు..



శరీరానికి సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించడంలో పండ్లు ముఖ్య పాత్ర పోషిస్తాయి. అందుకే ఆయా సీజన్లలో.. దొరికే పండ్లను తప్పక తినాలని నిపుణులు సూచిస్తారు. పండ్లలో మనకు మేలు చేసే విటమిన్లు, పోషకాలు, ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు, ఫోలిక్ యాసిడ్, సూక్ష్మపోషకాలు వీటిలో సమృద్ధిగా ఉంటాయి. అయితే, ఆరోగ్యానికి మంచిదని పండ్లు అతిగా తినకూడదని నిపుణులు చెబుతున్నారు. అదేవిధంగా, అధిక కేలరీలు, ఫైబర్, గ్లూకోజ్ అధికంగా ఉండే పండ్లు తప్పుడు కలయికతో రోజులో తప్పుగా తీసుకుంటే, అది బరువు పెరగడానికి, ఇతర ఆరోగ్య సమస్యలకు దారితీసే ప్రమాదం ఉంది. లో గ్లైసెమిక్ పండ్లు తీసుకోండి..



బరువు తగ్గాలనుకునే వారు, కంట్రోల్‌లో ఉంచుకోవాలనుకునేవారు.. లో గ్లైసెమిక్ పండ్లు తీసుకోవాలని సర్టిఫైడ్ న్యూట్రిషనిస్ట్ డాక్టర్ ఎ.ఎస్. రోహిణి పాటిల్, అన్నారు. మీ డైట్‌లో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండే.. బెర్రీలు, చెర్రీస్, యాపిల్స్, బేరి, దానిమ్మ వంటి పండ్లు తీసుకోండి. ఈ పండ్లు చక్కెరను రక్తప్రవాహంలోకి మరింత నెమ్మదిగా విడుదల చేస్తాయి, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో, బరువు పెరగడానికి దోహదపడే స్పైక్‌లను నిరోధించడంలో సహాయపడతాయి.ప్రొటీన్‌తో మిక్స్ చేసి తీసుకోండి.. మీరు పండ్లను సమతుల్యంగా, సంతృప్తికరంగా చేయడానికి, వాటిని ప్రొటీన్‌తో కలిపి తీసుకోవాలి. గ్రీక్ పెరుగు, కాటేజ్ చీజ్ పండ్లతో, నట్స్ వంటి ప్రొటీన్ రిచ్ ఫుడ్స్‌తో పండ్లు తీసుకుంటే.. ఆకలి కంట్రోల్‌లో ఉంటుంది, మీ కడుపు ఎక్కువసేపు నిండుగా ఉంటుంది.
ఖాళీ కడుపుతో తినొద్దు.. పండ్లలో పోషకాలు పుష్కలంగా ఉన్నా.. వాటిని ఖాళీ కడుపుతో తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు వేగంగా పెరుగుతాయి. దీనిని నివారించడానికి, ప్రొటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు తృణధాన్యాలు కలిగి ఉన్న సమతుల్య ఆహారంలో భాగంగా పండ్లను తినండి. పండ్లు ఆరోగ్యానికి మేలు చేసినా, వీటిలో సహజ చక్కెరలు, కేలరీలు అధికంగా ఉంటాయి. మీరు బరువును కంట్రోల్‌లో ఉంచుకోవడానికి, పోర్షన్ కంట్రోల్‌లో ఉంచుకోండి. సిఫార్సు చేయబడిన సర్వింగ్ పరిమాణాలకు కట్టుబడి, రోజంతా వివిధ రకాల పండ్లను ఆస్వాదించండి.
పండ్లు మీదే ఆదారపడకండి.. మీ డైట్‌లో కేవలం పండ్లు మాత్రమే తీసుకుంటే ఆరోగ్యానికి హాని జరుగుతుంది. అదనపు పోషకాలు, ఫైబర్ కోసం మీ భోజనంలో చేర్చుకోండి. ముక్కలు చేసిన పండ్లను సలాడ్‌లకు జోడించండి, స్మూతీస్‌లో కలపండి, తృణధాన్యాలు లేదా వోట్మీల్ కోసం టాపింగ్స్‌గా ఉపయోగించండి.






# ఎక్సర్‌సైజ్ తర్వాత స్నానం చేస్తున్నారా.. ఈ టిప్స్ మీకోసమే..





చెమటలు కక్కే వర్కౌట్ చేశాక చాలా మంది ఏంచక్కా స్నానం చేస్తారు. దీంతో హ్యాపీగా రిలాక్స్ అయినట్లుగా ఫీల్ అవుతారు. జిమ్ వెళ్ళి వచ్చాక స్నానం చేస్తే బాడీ పెయిన్స్ కూడా తగ్గుతాయి. మరి పూర్తి వివరాలు ఏంటో తెలుసుకోండి.
వర్కౌట్ తర్వాత.. ఫుల్ బాడీ వర్కౌట్ తర్వాత చల్లని, గోరువెచ్చని నీటితో స్నానం చేయడం మంచిదని చెబుతున్నారు నిపుణులు. దీని వల్ల బాడీ త్వరగా రికవరీ అవుతుంది. మనం జిమ్‌కి వెళ్ళినా, ఇంట్లోనే వర్కౌట్ చేసినా.. కండరాల్లో మార్పులు వస్తాయి. నొప్పులు కూడా ఉంటాయి. అయితే ఈ సమస్యల్ని తగ్గించేందుకు వర్కౌట్ తర్వాత రెస్ట్ అవసరం. స్నానం చేస్తే ఆ విశ్రాంతి మీకు లభిస్తుంది.
చెమట దూరం.. అయితే, వర్కౌట్ చేసినప్పుడు చాలా మంది చెమటలు పట్టి ఇబ్బందిగా ఫీల్ అవుతారు. అలాంటప్పుడు ఆ సమస్యని దూరం చేసేందుకు, చర్మ సమస్యలు దూరమవ్వడానికి స్నానం చేయడం మంచిది. స్నానం చేస్తే శారీరకంగా, మానసిక రిలాక్స్ అవుతుంది. హ్యాపీగా నిద్రపడుతుంది.
ఐస్ బాత్.. వర్కౌట్ తర్వాత ఐస్ బాత్ చేయడం చాలా మంచిదని చెబుతున్నారు నిపుణులు. దీని వల్ల నొప్పులు తగ్గుతాయి. శరీరంలో మంటను తగ్గించి రక్త ప్రవాహాన్ని మెరుగ్గా చేస్తుంది. దీంతో నొప్పులు తగ్గిపోతాయి. వర్కౌట్ చేసినప్పుడు అయిన గాయాలు, కాళ్ళు, చేతుల నొప్పుల నుంచి ఐస్ బాత్ హెల్ప్ చేస్తుంది. అయితే, మన దేశంలో ఇంకా ఐస్ బాత్ గురించి ఎవరికీ తెలియదు. దీనిని మీరు ట్రై చేయాలంటే ముందుగా డాక్టర్‌ని కన్సల్ట్ అవ్వాలి.
వేడినీటితో స్నానం.. ఇక వర్కౌట్ తర్వాత వేడి నీటితో స్నానం చేస్తే లాభాలతో పాటు నష్టాలు కూడా ఉన్నాయి. గోరువెచ్చని నీరు కండరాలు, కీళ్ళ నొప్పులని తగ్గిస్తుంది. రక్తప్రసరణని మెరుగ్గా చేస్తుంది. అలాగే కండరాలకి అవసరమైన ఆక్సీజన్ లభిస్తుంది. ఇవే కాకుండా వేడి నీటితో స్నానం చేస్తే బీపి తగ్గుతుంది.
నష్టాలు.. వేడి నీటితో స్నానం చేస్తే శరీరంలో మంట తగ్గదు. వాపులు పెరుగుతాయి. వేడి నీటితో స్నానం చేస్తే బాడీ డీహైడ్రేట్ అవుతుంది. గుండె జబ్బులు ఉన్నవారికి అస్సలు మంచిది కాదు. కాబట్టి, ముందుగా అసలు ఏ నీటితో స్నానం చేయాలనేది మీ డాక్టర్‌ని కలిసి కనుక్కోవడం మంచిది.







# కొవ్వులు మిమ్మల్ని ఆరోగ్యంగా ఉంచుతాయ్..




మీరు తినాల్సిన ఫుడ్స్ ఇవే..!
కొవ్వు.. అనగానే మన ఆరోగ్యానికి చెడు చేస్తుంది, అనే అలోచనలో ఉంటాం. అయితే, శరీరం కొవ్వును ఒక ఇంధనంలా ఉపయోగించుకుం టుంది. కొవ్వు చర్మం అడుగున, అవయవాల్లోనూ, ప్రతీ కణం చుట్టూరా కొవ్వు కణజాలం స్టోర్ అయి ఉంటుంది. మన శరీరానికి అవసరమైన శక్తిని అందిస్తూ ఉంటుంది. జీవక్రియలకు ఊతమిచ్చే ఎన్నెన్నో హార్మోన్ల ఉత్పత్తిని కొవ్వు ప్రేరేపిస్తుంది. కణ నిర్మాణం కొవ్వులో కరిగే విటమిన్ల శోషణలో కొవ్వు కీలక పాత్ర పోషిస్తుంది. అందుకే, మన డైట్ సరిపడా ఫ్యాట్స్ కూడా తీసుకోవడం చాలా ముఖ్యం. అయితే, ఇది మితిమీరితేనే అనర్థాలకు దారితీస్తుంది.
కొవ్వుల్లో రకాలు.. సంతృప్త కొవ్వులు..
ఈ కొవ్వులు సాధారణంగా గది ఉష్ణోగ్రత వద్ద ఘనరూపంలో ఉంటాయి. ఇవి ఎక్కువగా మాంసం, పాలు వంటి జంతు ఉత్పత్తులలో, కొబ్బరి నూనె, పామాయిల్ నూనెలో కనిపిస్తాయి. సంతృప్త కొవ్వులను మితంగా తీసుకోవాలని నిపుణులు సూచిస్తిన్నారు. ఇవి ఎక్కువగా తీసుకుంటే.. శరీరంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు పెరుగుతాయి. ఇది గుండె సమస్యల ముప్పును పెంచుతుంది.
మోనోఅన్‌శాచురేటెడ్ ఫ్యాట్స్.. ఈ కొవ్వులు గది ఉష్ణోగ్రత వద్ద ద్రవ రూపంలో ఉంటాయి. ఆలివ్ నూనె, అవకాడోలు, నట్స్‌లో ఇవి కనిపిస్తాయి. ఈ కొవ్వులు గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఇవి హెల్తీ ఫ్యాట్స్, చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తాయి. మన డేట్‌లో మోనోశాచురేటెడ్ ఫ్యాట్స్ తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు.
పాలీఅన్‌శాచురేటెడ్ ఫ్యాట్స్.. వీటిలో ఒమేగా -3, ఒమేగా -6 ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి. చేపలు, అవిసె గింజలు, వాల్‌నట్స్‌లో ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి. వీటిలో యాంటీఇన్ఫ్లమేటరీ గుణాలు ఉంటాయి. కూరగాయల నూనెలు, నట్స్‌లో ఒమేగా-6 ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి మేలు చేస్తాయి.
ట్రాన్స్ ఫ్యాట్స్.. ఇవి హైడ్రోజనేషన్ అనే ప్రక్రియ ద్వారా కృత్రిమంగా ఏర్పడే కొవ్వులు. ఇవి కొన్ని ప్రాసెస్ చేసిన ఆహారాలు, ఫ్రైడ్ ఫుడ్స్‌లో కనిపిస్తాయి. ట్రాన్స్ ఫ్యాట్స్ ఆరోగ్యానికి హాని చేస్తాయని, గుండె సమస్యలు వచ్చే ముప్పు ఎక్కువగా ఉంటుందని నిపుణులు అంటున్నారు. వీటికి దూరంగా ఉండటమే మేలు అని సూచిస్తున్నారు. శాచురేటెడ్ ఫ్యాట్స్ తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు.
మన ఆహారంలో సంతృప్త, ట్రాన్స్‌ఫ్యాట్‌లను మితంగా తీసుకోవాలని నిపుణులు అంటున్నారు. చాలా వరకు అసంతృప్త కొవ్వులను తీసుకోవాలని అంటున్నారు.
ఒక రోజులో ఎంత ఫ్యాట్ తీసుకోవచ్చు.. ఎంత కొవ్వు తీసుకోవాలనేది.. వ్యక్తిగత ఆహార అవసరాలుపై ఆధారపడి ఉంటుంది. మీ రోజువారి కేలరీ ఇన్‌టేక్‌లో 20-35 శాతం వరకు ఫ్యాట్స్ ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. సంతృప్త, ట్రాన్స్ ఫ్యాట్స్‌ను తగ్గించి.. మోనో అన్‌శాచురేటెడ్, పాలీఅన్‌శాచురేటెడ్ ఫ్యాట్స్ తీసుకోవాలి.
ఉదాహరణకు, మీరు 2,000 కేలరీల ఆహారం తీసుకుంటే, మీరు దాదాపు 40-55 గ్రాముల కొవ్వును తీసుకోవచ్చు.
ఇవి బెస్ట్ ఆప్షన్.. అవకాడోలు, నట్స్, విత్తనాలు,కొవ్వు చేపలు (సాల్మన్, మాకేరెల్, సార్డినెస్) వంటి అసంతృప్త కొవ్వులు అధికంగా ఉండే ఆహారాలను మీ డైట్‌లో చేర్చుకోండి ఆలివ్ ఆయిల్, కనోలా ఆయిల్ వంటి ఆరోగ్యకరమైన కొవ్వులు అధికంగా ఉన్న నూనెలను వంట చేయడానికి, డ్రెస్సింగ్ కోసం ఉపయోగించండి.
పోర్షన్ కంట్రోల్ చేయండి.. ఫ్యాట్స్‌లో కేలరీలు ఎక్కువగా ఉంటాయి. దీని దృష్టిలో ఉంచుకుని మితంగా తీసుకుంటేనే మేలు. సిఫార్సు చేసి సర్వింగ్ పరిమాణాలకు కట్టుబడి ఉండండి. ఆహారంలో సంతృప్త, ట్రాన్స్ ఫ్యాట్స్‌ను పరిమితం చేయండి. వేయించిన, ప్రాసెస్ చేసిన ఆహారాలకు దూరంగా ఉండండి.
ఎక్కువగా తింటే.. ప్రమాదమే.. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం, ఆహారంలో కొవ్వు ఎక్కువగా తీసుకుంటే.. ఊబకాయం, గుండె సమస్యలు, కొన్ని రకాల క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. కొవ్వు ఆహారం తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు, కొలెస్ట్రాల్, అలాగే లివర్ సమస్యలపై ప్రభావం చూపే గట్ ఆరోగ్యం, జీవక్రియను కూడా ప్రభావితం అవుతుంది.



# కొందరితో బంధానికి నిర్వచనం ఉండదు

సమంతతో సినిమా చేస్తానన్న సుధా కొంగరకొందరితో బంధం బలంగా ఉంటుందని..దానికి నిర్వచనం ఇవ్వలేమని ప్రముఖ నటి సమంత అన్నారు.
ఒక్క అంశం ఆధారంగా కెరీర్‌ను నిర్ణయించలేమని సమంత అన్నారు. తాజాగా కోలీవుడ్‌లో నిర్వహించిన గోల్డెన్ క్వీన్ పురస్కారాల్లో సమంత గోల్డెన్ క్వీన్‌గా అవార్డు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన కెరీర్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అలాగే దర్శకుడు, నటుడు రాహుల్ రవీంద్రన్‌తో తన అనుబంధాన్ని పంచుకున్నారు. నాకు ఆరోగ్యం బాగాలేనప్పుడు రాహుల్ నావెంటే ఉన్నాడు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ నాతోనే ఉంటూ జాగ్రత్తగా చూసుకున్నాడు. మా అనుబంధానికి పేరు పెట్టలేను. నా స్నేహితుడు, సోదరుడు, కుటుంబ సభ్యుడు, రక్తసంబంధీకుడా అని చెప్పలేనని అన్నారు.
అభిమానుల గురించి మాట్లాడుతూ.. ఇంతమంది అభిమానులను సొంతం చేసుకోవడం నా అదృష్టం. లక్‌తో పాటు- నేను పడిన కష్టమే ఈరోజు ఇంతమంది అభిమానానికి కారణం. దేవుడిచ్చిన వరంగా భావిస్తాను. మనం తీసుకునే ఒక్క నిర్ణయాన్ని దృష్టిలో ఉంచుకొని కెరీర్ ఎలా ఉంటు-ందో చెప్పలేం. ఒకవేళ ఎవరైనా అలా డిసైడ్ చేస్తే అది అబద్ధమే అవుతుంది. తెలిసి, తెలియక తీసుకున్న ఎన్నో నిర్ణయాలు కెరీర్‌పై ప్రభావం చూపుతాయని సమంత తెలిపారు. ఈ కార్యక్రమంలో దర్శకురాలు సుధ కొంగర మాట్లాడుతూ సమంతపై ప్రశంసల వర్షం కురిపించారు.సమంతకు నేను అభిమానిని. 5 సంవత్సరాలుగా ఆమెను దగ్గర నుంచి చూస్తున్నాను. ఆమె బాధపడినప్పుడు నాకు కన్నీళ్లు వచ్చేవి. సమంతను చూసి ఎంతోమంది అమ్మాయిలు ధైర్యం తెచ్చుకోవాలి. ఆమెతో సినిమా తీయాలని రెండుసార్లు ప్రయత్నించాను. కానీ, కుదరలేదు. ఎప్పటికైనా సమంతతో కచ్చితంగా సినిమా తీస్తాను. ఆమె నటించిన 'ఊ అంటావా..' పాట నాకు చాలా ఇష్టం' అని చెప్పారు. ఈ మాటలకు సమంత స్పందిస్తూ.. తనకు యాక్షన్ ఫిల్మ్ చేయాలనుందని చెప్పారు. కచ్చితంగా యాక్షన్ ఫిల్మ్ చేద్దామని సుధ అన్నారు.



# సూర్యతో మరోమారు జతకట్టబోతున్న కీర్తి

కీర్తి సురేష్..పేరు చెబితే మహానటి సినిమానే గుర్తుకు వస్తుంది. మూవీలో సావిత్రిగా నటించి అందరి మన్ననలు అందుకుంది. ఇక కీర్తి సురేష్ టాలీవుడ్ టాప్ హీరోల సరసన కూడా నటించి మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించుకుంది. కీర్తి సురేష్ టాలీవుడ్ టాప్ హీరోల సరసన కూడా నటించి మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించుకుంది. అప్పట్లో కీర్తి సురేష్‌ని వరుస హిట్స్ పలకరించిన ఇప్పుడు మాత్రం హిట్ దొరకడం కష్టంగా మారింది. గత కొంత కాలంగా టాలీవుడ్‌లో కూడా అవకాశాలు దక్కించుకోలేకపోతుంది. టాలీవుడ్ సినిమాలకు దూరంగా ఉంటు-న్న ఈ ముద్దుగుమ్మ.. కోలీవుడ్, బాలీవుడ్ లో మాత్రం పలు సినిమాలో నటిస్తూ బిజీ బిజీగా గడుపుతుంది. మొదట్లో పద్ధతిగా ఉన్న కీర్తి సురేష్ ఇటీవల గ్లామర్ డోస్ కూడా పెంచింది. పెళ్లయిన తర్వాత అమ్మడు గ్లామర్ షోలకు దూరంగా ఉంటుందని అంతా అనుకున్నారు దీనికి భిన్నంగా ముందుకంటే మరింతగా గ్లామర్ షోలు చేస్తూ రెచ్చిపోతుంది. గత సంవత్సరం అట్లీ- నిర్మాణంలో విడుదలైన బేబీ జాన్ చిత్రం ద్వారా హిందీలోకి అడుగుపెట్టింది కీర్తి సురేష్. ఆ చిత్రంతో కీర్తి బాలీవుడ్‌లో సత్తా చాటాలని అనుకుంది. కాని మూవీ పరాజయం చెందడంతో తిరిగి దక్షిణాది సినిమాలపై దృష్టి పెట్టాలని నిర్ణయించుకుందిట. రీసెంట్ గా కీర్తి సురేష్ మరో జాక్‌పాట్ కొట్టినట్టు తెలుస్తోంది
సార్, లక్కీ బాస్కర్ వంటి విజయవంతమైన చిత్రాలను తెరకెక్కించిన దర్శకుడు వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందనున్న చిత్రంలో కీర్తి సురేష్ హీరోయిన్ గా నటించనున్నారట. సూర్యా 46వ సినిమాగా ఈ చిత్రం రూపొందుతుండగా, ప్రస్తుతం ఈసినిమాకు సబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్ నడుస్తోంది. 7 ఏళ్ల క్రితం సూర్య, కీర్తి సురేష్ కాంబినేషన్ లో గతంలో ఒక సినిమా వచ్చింది. విగ్నేష్ శివన్ దర్శకత్వంలో వచ్చిన ఓ సినిమాలో వీరిద్దరు జంటగా నటించారు. కాని ఆ సినిమా డిజాస్టర్ అయ్యింది. ఈ సినిమా వచ్చిన దాదాపు 7 సంవత్సరాల విరామం తర్వాత మళ్ళీ సూర్యతో కలిసి నటిస్తుంది. మరి ఈ చిత్రంతో అయిన అమ్మడి ఫేట్ మారుతుందా చూడాలి.




# మరోమారు రజనీ సార్‌తో ఫహాద్ స్క్రీన్ షేర్

మలయాళ నటుడే అయినా సౌత్‌లో సూపర్బ్ పాపులారిటీ తెచ్చుకున్నాడు ఫహాద్ ఫాజిల్. 'పార్టీ లేదా పుష్పా' అనే డైలాగ్‌తో తెలుగులో తన ఇమేజ్‌ను మరింత పెంచుకున్నాడు. అలాగే పలువురు స్టార్ హీరోల చిత్రాల్లో నటించి తనదైన యాక్టింగ్‌తో మెస్మరైజ్ చేసిన ఫహాద్.. ఓ క్రేజీ కాంబోను రిపీట్ చేయబోతున్నాడట. ఇప్పటికే సూపర్ స్టార్ రజినీకాంత్ 'వేట్టయాన్'లో కీలక పాత్ర పోషించిన ఫహాద్.. మరోసారి రజినీతో స్క్రీన్ షేర్ చేసుకోబోతున్నట్టు- తెలుస్తోంది. నెల్సన్ దిలీప్ కుమార్ రూపొందిస్తున్న 'జైలర్ 2'లో ఓ ఇంపార్టెరట్ రోల్ కోసం ఫహాద్‌ను సంప్రదించగా, తను గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది. త్వరలోనే ఈ క్రేజీ కాంబోపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. 'వేట్టయాన్'లో వీరిద్దరి మధ్య వచ్చే సన్నివేశాలు సినిమాకు హైలైట్‌గా నిలవగా, 'జైలర్ 2' చిత్రంపైనా అంచనాలు ఏర్పడ్డాయి. అలాగే 'జైలర్'లో అతిథి పాత్రలు పోషించిన మోహన్ లాల్, శివ రాజ్‌కుమార్‌లు ఇందులోనూ కొనసాగుతారా లేదా అనేది తెలియాల్సి ఉంది. సన్ పిక్చర్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది.

# సారంగపాణి జాతకం బాగుంది !

యువ కథానాయకుడు ప్రియదర్శి వరుస సినిమాలతో మంచి ఫామ్‌లో ఉన్నారు. సున్నితమైన కథలు, స్వచ్ఛమైన హాస్యానికి పెట్టింది పేరు దర్శకుడు మోహనకృష్ణ ఇంద్రగంటి. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో వచ్చిన కామెడీ ఎంటర్‌టైనర్ 'సారంగపాణి జాతకం'. కుటుంబం మొత్తాన్ని థియేటర్‌కి కదిలించేంతగా నవ్వులు ఇందులో పండాయని అంటున్నారు. సారంగపాణి (ప్రియదర్శి) హ్యుందాయ్ కార్ల కంపెనీలో ఓ సేల్స్‌మేన్. రెండేళ్లుగా బెస్ట్ సేల్స్‌మెన్‌గా కొనసాగుతుంటాడు. అదే కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తుంటుంది మైథిలీ (రూప కొడువాయూర్). ఆమె ప్రేమలో ఉన్న సారంగకి చిన్నప్పటి నుంచీ జాతకాలపై నమ్మకం. ఆ రోజు కూడా అద్భుతమైన రోజు అని తెలిశాకే మైథిలీకి తన ప్రేమ విషయం చెప్పాలని ఆఫీస్‌కి బయల్దేరతాడు. మైథిలీయేమో నమ్మకాల్ని పట్టించుకోని ఆధునిక భావాలున్న ఓ యువతి. సారంగ తాను ప్రేమిస్తున్న సంగతిని చెప్పేలోపే మైథిలీ తన మనసులో మాటని చెబుతుంది. దాంతో ఆ ఇద్దరి ప్రేమకథ సుఖాంతమవుతుంది. ఇద్దరికీ వివాహం కూడా నిశ్చయమవుతుంది. ఇంతలో ఓ రోజు పబ్‌లో హస్త సాముద్రికుడైన జిగేశ్వరానంద (అవసరాల




శ్రీనివాస్)ని కలుస్తాడు సారంగ. చేయి చూసి భవిష్యత్తులో ఓ మర్డర్ చేస్తావని చెబుతాడు. అసలే జాతకాల్ని అతిగా నమ్మే సారంగ... మర్డర్ భయంతో తన పెళ్లిని వాయిదా వేసుకుంటాడు. జాతకంలో ఎలాగూ ఓ మర్డర్ చేస్తానని ఉంది కాబట్టి... పెళ్లికి ముందే ఆ పనిని పూర్తి చేస్తే తర్వాత తన వైవాహిక జీవితానికి ఏ సమస్యలు రావు కదాని ఓ నిర్ణయానికొస్తాడు. తన చిన్ననాటి మిత్రుడు, తనతోపాటే పనిచేసే చందు (వెన్నెల కిశోర్)తో కలిసి మర్డర్‌కి వ్యూహం పన్నుతారు. వీళ్లు హత్య చేయాలనుకున్న అహోబిల రావు (తనికెళ్ళ భరణి) ఎవరు? అతన్ని హత్య చేశారా లేదా? తదితర విషయాలు సినిమా కథలో భాగంగా వచ్చేవి. కథతో నవ్వించే సినిమాలు తెలుగులో వచ్చి చాలా కాలమైంది. కామెడీ అంటే లాజిక్ లేని సన్నివేశాలు, ద్వంద్వార్థాలతో కూడిన సంభాషణలేనేమో.. అలా కాకుండా ప్రేక్షకుల్ని నవ్వించడం కష్టమేమో అన్నట్టుగా ఈ మధ్య సినిమాలు వస్తున్నాయి. అందుకు భిన్నంగా కథ నుంచే స్వచ్ఛమైన వినోదం పుట్టించే ప్రయత్నం చేశారు. ఇందులోనూ క్రేజీగా వ్యవహరించే పాత్రలు, సిల్లీగా అనిపించే సన్నివేశాలు ఉన్నా అవన్నీ కథలో భాగంగానే వస్తుంటాయి. అతిగా నమ్మడంతో ఎన్ని అనర్థాలో చెప్పే ఈ కథకి దర్శకుడు మోహనకృష్ణ ఇంద్రగంటి మార్క్ రచన ప్రధానబలం. నేపథ్యం కొత్తదేమీ కాకపోయినా, కథ, కథనాలు ఊహకందినా సినిమాలో హాస్యంపాళ్లు మాత్రం ఎక్కడా తగ్గవు. శ్రీనివాస్ అవసరాల రాకతో సినిమా గమనం మారిపోతుంది. జాతకంలో ఉన్న మర్డర్‌ని పెళ్లికి ముందే చేయాలని ప్రియదర్శి, వెన్నెల కిశోర్ ఓ నిర్ణయానికి వచ్చే సన్నివేశాల నుంచి థియేటర్‌లో అసలు సిసలు సందడి మొదలవుతుంది. అక్కడి నుంచి వీళ్లు హత్య చేసేందుకు ఎంచుకునే వ్యక్తులు, అక్కడ వ్యూహాల్ని అమలు చేసేందుకు పడే పాట్లు-, ఆ సందర్భంలో పండే హాస్యం సినిమాకి హైలైట్.

# హిట్-3 పెద్దలకు మాత్రమే



నేచురల్ స్టార్ నాని హీరోగా నటించిన సినిమా హిట్ 3. విడుదలకు సిద్దంగా ఉంది. యంగ్ డైరెక్టర్ శైలేష్ కొలను దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో నానిని ఇప్పటి వరకు చూడని కొత్త యాంగిల్‌లో చూడబోతున్నాం. ఆ మధ్య రిలీజ్ అయిన టీజర్ తో ఇటీవల రిలీజ్ అయిన ట్రైలర్ చుస్తే ఈసారి వైలెన్స్‌కే వణుకు పుట్టించేలా ఉన్నాడు నాని. దసరా, సరిపోదా శనివారం లాంటి మాస్ సినిమాలు చేసినప్పటికీ హిట్ 3తో ఊహించని ఊచకోతకు రెడీ అవుతున్నాడు నాని. కాగా హిట్ 3 వరల్డ్ వైడ్ గా మే 1న రిలీజ్ కానుంది. రిలీజ్ కు వారం మాత్రమే గడువు ఉన్న నేపథ్యంలో ప్రమోషన్స్ లో స్పీడ్ పెంచారు మేకర్స్. సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న హిట్ 3 కు సెన్సార్ సభ్యులు ఎ సర్టిఫికెట్ అందించారు. సినిమాలో హింస, రక్తపాతం, వైలెన్స్ ఎక్కువగా ఉందని 'ఏ' సర్టిఫికెట్ జారీ చేసారు. 13 సంవత్సరాల కంటే తక్కువ వయసు ఉన్న వారికి అనుమతి లేదని చిన్న పిల్లలు ఈ సినిమాకు దూరంగా ఉండాలని సూచించింది. నాని స్వయంగా నటిస్తూ నిర్మిస్తున్న సినిమా కావడంతో ప్రమోషన్స్ ను భారీ ఎత్తున జెట్ స్పీడ్ లో చేస్తున్నాడు నాని. ఈ హిట్ సిరీస్ లోని తోలి రెండు బాగాలు హిట్ కావడంతో పాటు- నేచురల్ స్టార్ మోస్ట్ వాయిలెంట్ గా కనిపిస్తుండడం సినిమాకు గ్రాండ్ ఓపెనింగ్ తీసుకువచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ సినిమాపై ఫ్యాన్స్ భారీ

Printed, Edited by , Published and Owned by .M Chandrasekhar Address Plot No 12. Journalist. Colony .Near. B.T.R.Nagar. vaartha Office Back Side .KG Road. Kurnool. Andhra Pradesh .Pincode 518 001
Printed at Uttejitha printer’s, KURNOOL. AP. Cell No. 9440140418, RNI APTEL/2008/24570 ,